శనివారం 25.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 94 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 విద్యారంగంలో చారిత్రాత్మక సంస్కరణ. విద్యాశాఖ మంత్రి లోకేష్ నాయకత్వంలో 30, 100 రోజుల కార్యాచరణ, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు, తల్లికి వందనం, లీప్ యాప్ వంటి పథకాలతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

- తల్లిదండ్రులు-టీచర్లు కలిస్తేనే విద్యార్థుల విజయం
- మెగా పీటీఎంతో విద్యా వ్యవస్థలో కొత్త అధ్యాయం
- ప్రభుత్వ బడులపై పెరుగుతున్న నమ్మకం
- సంక్షేమం విషయంలో రాజీ ప్రసక్తే లేదు
- గిరిజనులకు అండగా ఉంటాం... ఆందోళన వద్దు
- రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు





**రంపచోడవరం (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ఆయన.. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఇప్పటికే గణనీయమైన మార్పులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ప్రైవేట్ పాఠశాలల నుంచి లక్షా పది వేల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం ప్రభుత్వ విద్యపై పెరిగిన విశ్వాసానికి నిదర్శనమన్నారు. విద్యార్థుల మార్కులు తగ్గితే అది విద్యాశాఖ పనితీరుపైనే ప్రతిబింబిస్తుందని, అందుకే మంత్రి నారా లోకేష్ విద్యాశాఖ బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, సరైన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. విద్యే పిల్లలకు తల్లిదండ్రులు ఇవ్వగలిగే గొప్ప ఆస్తి అని, ప్రపంచ వ్యాప్తంగా తెలుగు ప్రజలు రాణించడానికి విద్యే కారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పిల్లల అభివృద్ధి బాధ్యతను తల్లి, తండ్రి ఇద్దరూ సమానంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లకు తల్లులతో పాటు తండ్రులు కూడా తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్మించేది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులేనని, అందుకే రాష్ట్రవ్యాప్తంగా మెగా పీటీఎంలను నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఉపాధ్యాయులు మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా బోధనా విధానాలను మార్చుకోవాలని, కొత్త పద్ధతులను అవలంభించాలని సూచించారు. టీచర్లకు ప్రభుత్వం సముచిత గౌరవం ఇస్తోందని, బదిలీలను పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తున్నామని తెలిపారు.

**విద్యతో పాటు ఆరోగ్యం, ఉపాధిపైనా ప్రత్యేక దృష్టి :** రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. తల్లికి వందనం పథకం నిధులు ఇప్పటికే తల్లుల ఖాతాల్లో జమ అయ్యాయని చెబుతూ జమ అయ్యాయా లేదా అంటూ సభలోనే ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

# పోస్టల్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు

- ప్రజలకు మరింత చేరువగా ఇండియా పోస్ట్..
- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించాలి
- కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** భారత తపాలా శాఖను ప్రపంచ స్థాయి సేవా సంస్థగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సాంకేతికత, సమర్థవంతమైన నాయకత్వం, ఉద్యోగుల అంకితభావంతో గత రెండేళ్లలో పోస్టల్ శాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని తెలిపారు. గుంటూరులో నూతనంగా ఆధునీకరించిన కొత్తపేట, చంద్రమౌళినగర్ సబ్ పోస్టాఫీసులను శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. మిగతా 2లో...



# నిరుద్యోగులకు మరో డీఎస్సీ



- త్వరలో 3 వేల టీచర్ పోస్టుల భర్తీ: లోకేశ్
- ప్రభుత్వ బడుల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త నియామకాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై దృష్టి పెట్టింది. ప్రైవేటు సెక్టార్‌లో ఇప్పటికే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తోంది. మిగతా 2లో...

# ఏపీ-కర్ణాటకకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



- బళ్లారి-గుంతకల్లు 3, 4వ రైల్వే లైన్లకు కేబినెట్ ఆమోదం
- రూ.3,030 కోట్ల 'భవ్య రసాయన' పథకానికీ ఓకే.. పేపర్ లీక్‌పై మరింత కఠిన చట్టం

● వివరాలు 2 లో

# సర్కారు బడులకే విద్యార్థుల క్యూ

- ప్రైవేటు నుంచి 1.10 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరిక
- 'నో అడ్మిషన్' బోర్డులే రెండేళ్ల విద్యా సంస్కరణలకు నిదర్శనం: లోకేశ్
- వచ్చే ఏడాదికల్లా గిరిజన ప్రాంత స్కూళ్లన్నింటికీ సొంత భవనాలు



**రంపచోడవరం (జర్నలిస్ట్ ఫైల్):** వచ్చే ఏడాది లోగా గిరిజన ప్రాంతాల్లో భవనాలు లేని ప్రభుత్వ స్కూళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేస్తాం, పాడైన బిల్డింగులను బాగు చేస్తామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రంపచోడవరం గవర్నమెంట్ హైస్కూలులో నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలసి మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మనందరి రెండేళ్ల కృషి ఫలించింది. సుమారు 1.10లక్షల మంది విద్యార్థులు ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చేరారు. దీనికి కారణం ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులే. పిల్లల మంచిమార్కులే మనకు పబ్లిసిటీ. ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు చూస్తున్నాం. నేను నా నియోజకవర్గం మంగళగిరిలో పర్యటిస్తున్నప్పుడు ఒక తల్లి నా దగ్గరకి వచ్చింది. అన్నా నా బిడ్డకి స్కూల్ లో సీట్ కావాలి అని అడిగింది. ఆ సీట్ ప్రభుత్వ పాఠశాలలో కావాలి అని అడిగింది ఆ తల్లి. నేను ఒక్క నిమిషం షాక్ అయ్యా. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో నిడమర్రు స్కూలును పైలెట్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేశాను. అది సక్సెస్ అయితే నియోజకవర్గానికి ఒక స్కూల్ కట్టాలి అనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం డిమాండ్ పెరిగింది. ఉపాధ్యాయుల కఠోరశ్రమతో ప్రభుత్వ స్కూళ్లకు పూర్వవైభవం వస్తోంది. మిగతా 2లో...



# భోగాపురం.. ఇక ఈ-రైడ్!

- విశాఖ నుంచి విమానాశ్రయానికి 20 ఎలక్ట్రిక్ బస్సులు
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

**విశాఖపట్నం, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి పర్యావరణహిత, అత్యాధునిక ప్రజా రవాణా సేవలను అందించే లక్ష్యంతో పీఎం ఈ-బస్సులను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం విశాఖ స్టీల్ సిటీ డిపోలో ప్రారంభించారు. మిగతా 2లో...

# రాష్ట్ర వైద్యానికి 'సంజీవని' జవసత్వాలు

- 10.51 లక్షల మందికి సమగ్ర ఆరోగ్య ఖాతాలు
- 2.48 లక్షల మంది రోగులకు వైద్యులతో నేరుగా అపాయింట్‌మెంట్లు
- ఎన్సీడీ 4.0 కింద గుర్తించిన 2.72 కోట్ల మంది ఆరోగ్య వివరాలు సంజీవనితో అనుసంధానం
- 'ఆర్‌బియస్‌కె' విద్యార్థుల వివరాలు కూడా
- నేడు కర్నూలు జిల్లా ఆస్పరిలో 'సంజీవని'ని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రజారోగ్య వ్యవస్థను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన 'ప్రాజెక్టు సంజీవని' వైద్య సేవల్లో కీలక మైలురాయిగా నిలుస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గ్రామంలో పరీక్షలు చేయించుకున్న రోగి జిల్లా లేదా బోధనాస్పత్రికి వెళ్లినా అతడి పూర్తి ఆరోగ్య చరిత్ర వైద్యులకు వెంటనే అందుబాటులోకి వచ్చేలా ఈ వ్యవస్థను రూపొందించినట్లు చెప్పారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కుప్పంలో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన సంజీవని మిగతా 3లో...

# గుచ్చిమి బాటలో కుంకీలు



- జయంత్, అభిమన్యులకు మంగళగిరిలో ఘన స్వాగతం పలికిన పవన్ కళ్యాణ్
- స్వయంగా ఆహారం అందించి.. జెండా ఊపి పార్వతీపురానికి సాగనంపిన ఉప ముఖ్యమంత్రి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పార్వతీపురం మన్యం జిల్లాలో మానవ-ఏనుగు సంఘర్షణల నివారణ చర్యలను బలోపేతం చేసే దిశగా పలమనేరు ముసలమడుగు ఏనుగుల శిబిరం నుంచి గుచ్చిమి ఏనుగుల శిబిరానికి తరలిస్తున్న శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి మిగతా 2లో...

# ప్రభుత్వ బడులే బంగారు బాట

- తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యా విప్లవం: అచ్చెన్నాయుడు
- మెగా పీటీఎంలో విద్యార్థులతో ముచ్చట.
- రూ.1.94 కోట్ల కేజీబీవీ భవనం ప్రారంభం



**కోటబొమ్మాళి, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** కోటబొమ్మాళి మండలం యలమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ (పీటీఎం)లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి వారి చదువు, భవిష్యత్ లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. అనంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో తల్లిదండ్రుల భాగస్వామ్యమే కీలకమని పేర్కొన్నారు.

అంతకుముందు కోటబొమ్మాళి గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అనుబంధ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో రూ.1.94 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫేజ్-2 భవనాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ వసతీగృహాలను దశలవారీగా రెసిడెన్షియల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి ప్రభుత్వం లేదా ఉపాధ్యాయులతో మాత్రమే సాధ్యం కాదని, తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా అత్యంత కీలకమని అన్నారు. 1996లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యా కమిటీలను ఏర్పాటు చేసి తల్లిదండ్రులను విద్యా వ్యవస్థలో భాగస్వాములను చేసిన విషయాన్ని గుర్తు చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందన్నారు. మిగతా 2లో...

## నిరుద్యోగులకు మరో డీఎస్సీ

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉద్యోగ మేళాను నిర్వహిస్తూ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు ఇస్తోంది. అయితే విద్యాశాఖలో ఉద్యోగాల భర్తీకి మంత్రి లోకేశ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇప్పటికే మెగా డీస్సీ నిర్వహించారు. ఇప్పుడు మరోమారు కూడా భర్తీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఖాళీలను గుర్తించారు. ఈ మేరకు త్వరలోనే నోటిఫికేషన్ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇందులో భాగంగా మంత్రి నారా లోకేశ్ తాజాగా కీలక ప్రకటన చేశారు. పోలవరంలో పర్యటించిన ఆయన మరోసారి డీఎస్సీ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. మొత్తం 3 వేల టీచర్ పోస్టుల భర్తీ చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఈ సంవత్సరం లక్షా 10 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ స్కూల్స్‌కు వచ్చేశారని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. పలు ప్రభుత్వాల్లో నో అడ్మిషన్ పెట్టిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు విద్యా ప్రమాణాలను పెంచామని, ఈ మేరకు మంచి ఫలితాలు లభించాయని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.

## ఏపీ-కర్ణాటకకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన శుక్రవారం కేంద్ర మంత్రిమండలి (కేబినెట్) సమావేశమై పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార ప్రసార, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

**ఏపీ - కర్నాటక మధ్య కొత్త రైల్వే లైన్లు.. :** తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న కర్నాటకకు ప్రయోజనం చేకూర్చేలా రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. బళ్లారి - గుంతకల్లు మధ్య 3వ, 4వ రైల్వే లైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రూ1,264 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టను మూడేళ్ల వ్యవధిలో పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏపీ, కర్నాటక సరిహద్దుల్లోని దాదాపు 99 గ్రామాలకు మెరుగైన రైల్వే అనుసంధానం లభించనుంది. ఇందులో భాగంగా వేదవతి నదిపై భారీ రైల్వే వంతెన నిర్మాణానికి కూడా కేబినెట్ పచ్చజెండా ఊపింది.

**రూ.3,030 కోట్లతో భవ్య రసాయన పథకం.. :** దేశంలో రసాయన పరిశ్రమల పురోగతికి ప్రత్యేక ప్రోత్సాహకాలను కేబినెట్ ప్రకటించింది. దేశంలో కెమికల్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రూ.3,030 కోట్లతో 'భవ్య రసాయన పథకానికి' ఆమోదం లభించింది. ఈ పథకంలో భాగంగా ఏర్పాటు చేసే ఒక్కో కెమికల్ పార్కుకు రూ.1,000 కోట్ల చొప్పున నిధులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

**పేపర్ లీకైపై కఠిన చట్ట సవరణ బిల్లుకు గ్రీన్ సిగ్నల్.. :** దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని అరికట్టేందుకు కేంద్రం తీవ్రంగా పరిగణించింది. పేపర్ లీక్ నిరోధక చట్ట సవరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణల ప్రకారం, పోటీ పరీక్షల పేపర్ లీకేజీకి లేదా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడే నిందితులపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటారు. లీకేజీలకు పాల్పడితే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు, రూ.10 కోట్ల వరకు భారీ జరిమానా విధించే వెసులుబాటును ఈ కొత్త చట్టంలో కల్పించనున్నారు.

## ప్రభుత్వ బడులే బంగారు బాట



(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. క్లిష్టమైన విద్యాశాఖను స్వీకరించి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తూ రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు కొత్త గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు. తల్లిదండ్రులను విద్యా వ్యవస్థలో ప్రత్యక్ష భాగస్వాములను చేసేందుకు సంవత్సరానికి రెండుసార్లు మెగా పీటీఎంలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 68 లక్షల మంది విద్యార్థులకు, 48 లక్షల మంది తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేశామని తెలిపారు. ఈ పథకం అమలుతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సుమారు 1.40 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని వెల్లడించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, ఆధునిక వంటశాలలు, మౌలిక వసతులు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. ఉపాధ్యాయులపై పరిపాలనా భారం తగ్గించి, సాంకేతికత వినియోగంతో తల్లిదండ్రులు తమ పిల్లల హాజరు, చదువు, పరీక్షల వివరాలను మొబైల్ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం కల్పించామని వివరించారు.

యలమంచిలి పాఠశాలతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని మంత్రి పేర్కొన్నారు. గతంలో పాఠశాలకు స్థల సమస్య ఉండేదని, ప్రజల సహకారంతో అదనపు స్థలం సమకూర్చి అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. అనంతరం హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు ఇటీవల 12 మంది ఉపాధ్యాయులను నియమించామని చెప్పారు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, గ్రౌండ్ లెవెలింగ్ తదితర మౌలిక వసతులను త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

టెక్కలి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.640 కోట్లతో తాగునీటి పథకం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే నేరేడు బ్యారేజ్ నిర్మాణానికి రూ.641 కోట్ల పరిపాలనా అనుమతులు లభించాయని, అది పూర్తయితే శ్రీకాకుళం జిల్లాలో తాగునీటి, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

అనంతరం యలమంచిలి పంచాయతీలో కవిటి మల్లేశు ఇంటి నుంచి గొల్లవీధి వరకు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన మంత్రి, బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చదువే పిల్లలకు శాశ్వత ఆస్తి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం-2.0 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లు, సోలార్ విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే ప్రజారోగ్యంపై దృష్టి సారించామని... ఆగస్టు నుంచి సంజీవని హెల్త్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల మేర అప్పులు చేసిందని తెలిపారు. పైగా 14 శాతం మేర వడ్డీలకు కొన్ని అప్పులను తెచ్చిందని ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ఆ అప్పులను నెమ్మదిగా తీర్చేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని.. అలాగే వడ్డీలు తగ్గించేలా కసరత్తు చేస్తూ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఒకవైపు ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమతూకంగా కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ కోచింగ్ అందిస్తున్నామని, గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాలలను విస్తరిస్తామని వెల్లడించారు. హాస్టళ్లు, గురుకులాల్లో డైట్ ఛార్జీలను 10 శాతం పెంచామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, గత ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని గుర్తుచేశారు. తన పాలనలో 16 ఏళ్లలో 14 సార్లు డీఎస్సీ నిర్వహించానన్నారు. ఈ ఏజెన్సీ ఏరియాలో ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో రిక్రూటైన ఉపాధ్యాయులే ఉన్నారని దానికి ఇదే నిదర్శనమన్నారు. ప్రధాని మోదీ, తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చప్పామిని.. దానికి అనుగుణంగా పని చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తాము కూటమిగా రాష్ట్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని... మెగా డీఎస్సీ నిర్వహించి టీచర్ పోస్టులు రిక్రూట్ చేస్తే... దానిపై బురద జల్లుతున్నారని సీఎం విమర్శించారు. రిక్రూటైన టీచర్ల మనోభావాలను దెబ్బతీసేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఇలాంటి వారిని కట్టడి చేయాలని సూచించారు. రాజకీయ నేతలు, అధికారులు తేడాగా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. రంపచోడవరం నియోజకవర్గంలో గతంలో కొందరు దుర్మార్గాలు చేశారని... దళిత డ్రైవరును చంపి డోర్ డెలివరి చేసిన



నేతలు ఇక్కడ రాజకీయం చేశారని గుర్తు చేశారు. తల్లిని, చెల్లిని గౌరవించని వాళ్లు సమాజానికి ఏం చెబుతారు..? ఏం మేలు చేస్తారని.. ఇలాంటి వాళ్లు రాజకీయాల్లో ఉండకూడదని సీఎం అన్నారు. మంచిని ప్రోత్సహించాలి... చెడును తప్పు పట్టాలని అప్పుడే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలుపై ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని... ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ.. వారు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తున్నామని చెప్పారు. 94 శాతం స్ట్రైక్ రేటుతో గడచిన ఎన్నికల్లో గెలిపించారని... వచ్చే ఎన్నికల్లో అంతకు మించిన గెలుపును సాధిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

**డ్రగ్స్‌కు చెక్... గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం :** గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును అరికట్టి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కల్పించామని గుర్తు చేశారు. పిల్లలకు చక్కటి విద్యను అందిస్తామని... ఉద్యోగాలకు ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా పెద్దపెద్ద పరిశ్రమలను తెస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖకు గూగుల్ సంస్థ వచ్చిందని... భోగాపురం ఎయిర్ పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆగస్టు 1వ తేదీన ప్రధాని మోదీ భోగాపురం ఎయిర్ పోర్టును ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు కష్టపడకుండా.. ఇష్టపడి చదవాలని... ఐదేళు కష్టపడి చదివితే పెద్ద పెద్ద పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించేలా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పోలవరాన్ని నెంబర్-1 జిల్లాగా తయారు చేస్తామని... 2000లో జీవో నెంబర్-3 తెచ్చి.. స్థానిక గిరిజనులకే ఉద్యోగాలిచ్చేలా అండగా నిలబడ్డామని గుర్తు చేశారు. కానీ 2020లో సుప్రీం కోర్టు ఆ జీవోను రద్దు చేసిందని... దీనిపై ఇప్పుడు చర్చిస్తున్నామని గిరిజనులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు.

**విద్యార్థుల కలలకు సీఎం ప్రోత్సాహం :** సభలో పలువురు విద్యార్థులు తమ లక్ష్యాలు, ఆశయాలను వెల్లడించగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వారిని అభినందించారు. తాను భవిష్యత్తులో ఐఏఎస్ అధికారిగా మారి ముఖ్యమంత్రికి రిపోర్ట్ చేస్తానని చెప్పిన విద్యార్థి సాత్విక్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందిస్తూ, అతని సంకల్పం తప్పకుండా నెరవేరుతుందని ఆకాంక్షించారు. "డేర్ టు డ్రీమ్... స్ట్రైవ్ టు అచీవ్" అనేది తాను ఎప్పుడూ చెప్పే సందేశమని పేర్కొన్న సీఎం... పిల్లలను ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేలా వారితో నిరంతరం సంభాషించాలని సూచించారు. పోలవరం ప్రాంతం నుంచి ప్రపంచానికి సేవలందించే స్థాయికి విద్యార్థులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ రూపొందించిన "డ్రగ్స్ వద్దు బ్రో" హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం "బడి కోసం డోనర్" వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభమైన వెంటనే మీ సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ రంపచోడవరం హైస్కూల్‌కు రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. నెల్లూరు జిల్లా జెడ్పీ హైస్కూల్‌కు పారిశ్రామికవేత్త పూర్ణ చంద్రరావు రూ.4 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. వీరిద్దరిని సీఎం చంద్రబాబు అభినందించారు. అలాగే సభా వేదిక మీద నుంచి పోలవరం జిల్లాలో వివిధ శాఖల పనితీరును ముఖ్యమంత్రి వివరించారు. పనితీరు బాగా కనబరిచిన అధికారులను అభినందించిన ముఖ్యమంత్రి... సభికులతోనూ చప్పట్లు కొట్టించారు.

**పేరెంట్స్, టీచర్లతో ముఖాముఖి :** మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సందర్భంగా రంపచోడవరం ప్రభుత్వ హైస్కూలు, జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులు, మార్కులు, హాజరు, ఆరోగ్య వివరాలను స్వయంగా పరిశీలించి తల్లిదండ్రులకు వివరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల రిపోర్టు కార్డులను వారి ఇళ్లకే పంపేలా జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. మరో తరగతి గదిలో స్మార్ట్ బోర్డు ద్వారా బోధనా విధానాన్ని పరిశీలించిన సీఎం.. కొద్దిసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని ఉత్సాహపరిచారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు నాటిన మొక్కలను పరిశీలించిన సీఎం.. గ్రీన్ పాస్‌పోర్టు, క్యూఆర్ కోడ్ ఆధారంగా మొక్కల వివరాలు తెలుసుకునే విధానాన్ని అభినందిస్తూ రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మెగా పీటీఎం ఫొటోఫ్రేమ్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఫొటో దిగారు.

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సీఎం :** మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యత, రుచి ఎలా ఉందని విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పోషకాహారం మరింత మెరుగ్గా అందించాలని సీఎం సూచించారు. విటమిన్ లోపాలు రాకుండా పోషకాహారం అందిస్తున్నామని, కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనంతో పాటు చిక్కి, ఉదయం రాగిమాల్ట్ అందిస్తున్నామని చెప్పగా, ఇంటికి వెళ్లే ముందు కూడా చిక్కిలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. అనంతరం విద్యార్థుల కోరిక మేరకు వారితో కలిసి ప్రత్యేకంగా ఫొటోలు దిగుతూ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోస్టల్ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరువగా ఉన్న ఏకైక ప్రభుత్వ వ్యవస్థ పోస్టల్ శాఖేనని పేర్కొన్న మంత్రి, వికసిత్ భారత్ నిర్మాణంలో ఈ శాఖ కీలక పాత్ర పోషించబోతుందని అన్నారు. గత రెండు దశాబ్దాల్లో జరగని స్థాయిలో కేవలం రెండేళ్లలోనే పోస్టల్ శాఖలో మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. సరైన నాయకత్వం, సాంకేతికత, దిశ ఉంటే ప్రభుత్వ రంగ సంస్థలు కూడా ప్రపంచ స్థాయి సేవలు అందించగలవని పోస్టల్ శాఖ నిరూపిస్తోందన్నారు.



పోస్టల్ శాఖను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆదాయం పెరిగితేనే ఉద్యోగుల సంక్షేమం, ఆధునికీకరణ, కొత్త సేవల విస్తరణ సాధ్యమవుతుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు కూడా సేవా దృక్పథంతో ప్రైవేట్ రంగానికి ఏమాత్రం తీసిపోకుండా పనిచేయగలరని పోస్టల్ ఉద్యోగులు నిరూపిస్తున్నారని కొనియాడారు.

గ్రామీణ భారతాన్ని పూర్తిగా డిజిటల్ వ్యవస్థలోకి తీసుకురావడంలో పోస్టల్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ లావాదేవీలు పెరగడం వల్ల పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుందని చెప్పారు. గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, రైతులు, చిన్న వ్యాపారులు తయారు చేసే ఉత్పత్తులను దేశవ్యాప్తంగా, విదేశాలకు చేర్చే సామర్థ్యం పోస్టల్ శాఖకు ఉందన్నారు.

లాజిస్టిక్స్ రంగంలో విస్తృత సంస్కరణలు చేపట్టామని, ఆధునిక ప్యాకేజింగ్ విధానాలతో పాటు ఓఎన్‌డీసీ (రాచీణజ), జీఈఎం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో, పతంజలి వంటి సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 24 నుంచి 48 గంటల్లో పార్సెల్ డెలివరీ, ఎండ్-టు-ఎండ్ ట్రాకింగ్, ఎస్ఎంఎస్ అలర్ట్స్, ఓటీపీ ఆధారిత డెలివరీ, జియో ట్యాగింగ్ వంటి సేవలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ పార్సెల్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు డీహెచ్ఎల్‌తో భాగస్వామ్యం ఏర్పాటు చేస్తున్నామని, గ్రామాల నుంచి ప్రపంచంలోని ఏ దేశానికైనా తక్కువ సమయంలో పార్సెల్ చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే సుమారు 80 శాతం పోస్టల్ లావాదేవీలు డిజిటల్ రూపంలో జరుగుతున్నాయని, త్వరలో పూర్తిస్థాయి క్యాష్‌లెస్ పోస్టాఫీసుల దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. ఆధార్, పాస్‌పోర్ట్ సేవలు, విస్తరించిన కార్యాలయ సమయాలు, శనివారం అపాయింట్‌మెంట్ సౌకర్యాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పారు.

పోస్టాఫీస్ సేవింగ్స్ పథకాలు అత్యంత భద్రమైనవని, అధిక వడ్డీని అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఈ సేవలను చేరవేసేందుకు సాచురేషన్ విధానంలో పనిచేస్తున్నామని చెప్పారు. సైలెంట్ ఖాతాలను తిరిగి యాక్టివ్ చేస్తూ వేలాది మంది ఖాతాదారులను పోస్టల్ సేవలకు మళ్లీ అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు.

ఐటీ 2.0 సంస్కరణల ద్వారా సేవింగ్స్, ఇన్సూరెన్స్ సేవలను పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. యువతను ఆకర్షించేందుకు దేశవ్యాప్తంగా జెన్-జీ పోస్టాఫీసులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. తొలిసారిగా ప్రైవేట్ రంగ నిపుణులతో చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ వ్యవస్థను ఏర్పాటు చేసి పోస్టల్ శాఖను కార్పొరేట్ స్థాయి సామర్థ్యాలతో ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.

ఉద్యోగుల కోసం ప్రత్యేక మొబైల్ యాప్, ఆధునిక శిక్షణ కార్యక్రమాలు, కస్టమర్ కేంద్రిత సేవలతో నాణ్యతను పెంచుతున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా పోస్టాఫీసులను దశలవారీగా ఆధునీకరిస్తూ ప్రజలకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పిస్తున్నామని చెప్పారు. పోస్టల్ శాఖ ఆస్తులను సమర్థంగా వినియోగించి కో-వర్కింగ్ స్పేస్‌లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా అదనపు ఆదాయం సమకూర్చే చర్యలు చేపట్టామని వివరించారు.

పోస్టల్ ఉద్యోగులు ప్రతి ఇంటికి చేరుకుని సేవింగ్స్, ఇన్సూరెన్స్, ఆర్థిక అక్షరాస్యతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలు బాలికల భవిష్యత్తును బలోపేతం చేస్తున్నాయని, రైతులు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను పోస్టల్ నెట్‌వర్క్ ద్వారా దేశవ్యాప్తంగా మార్కెట్‌కు చేరవేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

సంస్కరణల ఫలితంగా గతంలో సంవత్సరానికి సుమారు రూ.200 కోట్ల మేర పెరిగే పోస్టల్ ఆదాయం, ఒక్క ఏడాదిలోనే రూ.2,100 కోట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు. దేశంలో అత్యంత విశ్వసనీయమైన, అత్యంత ఆధునికమైన, ప్రజలకు అత్యంత చేరువైన సేవా సంస్థగా పోస్టల్ శాఖను తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని డా. పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు.

## విద్యుత్ బస్సులను ఆర్టీసీయే నిర్వహించాలి

- **పినాకిల్‌తో ఒప్పందం రద్దు చేయాలని కార్మిక సంఘాల డిమాండ్**

**విజయవాడ, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ) ద్వారానే నిర్వహించాలని వివిధ కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. పినాకిల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన "ఏపీఎస్ఆర్టీసీ పరిరక్షణ" రాష్ట్ర సదస్సులో తీర్మానం చేశాయి. విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం ప్రభుత్వ రంగ సంస్థను బలహీనపరిచే చర్య అని సదస్సులో నాయకులు విమర్శించారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, ఏలూరు తదితర ప్రాంతాల్లో ఆర్టీసీ భూములు, డిపోలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్, ఎంప్లాయీస్ యూనియన్, ఎన్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ తదితర కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజల డబ్బుతో నిర్మించిన ఆర్టీసీని ప్రైవేటీకరించకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే



కొనుగోలు చేసి ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని, ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ప్రజలపై అదనపు భారం పడటంతో పాటు ఉద్యోగుల భద్రత దెబ్బతింటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సంయుక్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సదస్సులో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహమ్మద్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గుచ్చిమి బాటలో కుంకీలు



(మొదటి పేజీ తరువాయి)

క్యాంపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. గజరాజులకు మార్గమధ్యంలో పూలు చల్లి స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రివర్యులు, వాటికి స్వయంగా ఆహారం అందజేశారు. అనంతరం గుచ్చిమి శిబిరానికి బయలుదేరిన కుంకీల రెండో అంచె ప్రయాణాన్ని జెండా ఊపి సాగనంపారు.

ఈ సందర్భంగా ప్రయాణంలో కుంకీల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ అధికారులకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. గుచ్చిమి క్యాంపునకు చేరిన అనంతరం నిపుణుల పర్యవేక్షణలో అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటుపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జయంత్, అభిమన్యుల సేవలు పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో మానవ-ఏనుగు ఘర్షణల నియంత్రణకు ఎంతో ఉపయోగపడనున్నాయని ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రజల భద్రత, రైతుల పంటల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యాలను కూటమి ప్రభుత్వం శాస్త్రీయ, మానవీయ విధానాలతో చేపడుతున్న చర్యల్లో భాగంగా కుంకీలను తరలిస్తున్నామని అన్నారు.

**ఒడిశా వైపు నుంచి ఏనుగులు :** ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఏనుగుల గుంపులు తరచూ పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశిస్తూ పంటలు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో, మానవ-ఏనుగు ఘర్షణల నివారణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ కుంకీ ఏనుగులను గుచ్చిమి శిబిరానికి తరలిస్తున్నారు. మానవ-ఏనుగు ఘర్షణల నివారణ చర్యల్లో భాగంగా కుంకీ ఏనుగులైన జయంత్, అభిమన్యులను వినియోగిస్తారు.

గతంలో పలమనేరు, చిత్తూరు ప్రాంతాల్లో నిర్వహించిన పలు కీలక ఆపరేషన్లలో ఈ రెండు కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషించాయి. అడవి ఏనుగుల గుంపులను సురక్షితంగా అటవీ ప్రాంతాలకు మళ్లించడంలో ఎంతో చురుకుగా వ్యవహరించాయి.

## భోగాపురం.. ఇక ఈ-రైడ్!

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆర్టీసీ ఈడీ, రీజినల్ మేనేజర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆర్టీసీ అధికారులు పీఎం ఈ-బస్సులో ప్రయాణించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రధానమంత్రి పీఎం ఈ-బస్ సేవా పథకం కింద రాష్ట్రానికి మొత్తం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయని, వాటిలో విశాఖపట్నానికి 100 ఈ-బస్సులు కేటాయించినట్లు తెలిపారు. తొలి విడతగా 20 ఈ-బస్సులను భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రత్యేకంగా నడపనున్నట్లు వెల్లడించారు. గాజువాక-ఎన్ఏడీ-ఆనందపురం, అలాగే గాజువాక-రైల్వే స్టేషన్-ఆర్టీసీ కాంప్లెక్స్-సిరిపురం మార్గాల్లో ఈ బస్సులు సేవలందించనున్నాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

12 మీటర్ల పొడవుతో రూపొందించిన ఈ అత్యాధునిక ఎలక్ట్రిక్ బస్సుల్లో ఎయిర్ సస్పెన్షన్, ఆటోమేటిక్ డోర్లు, 35 మంది ప్రయాణికులకు సీటింగ్ సామర్థ్యం, దివ్యాంగుల కోసం వీల్‌చైర్ లిఫ్ట్ వంటి సౌకర్యాలు కల్పించినట్లు అధికారులు తెలిపారు.

## అమరావతిలో కేంద్ర ప్రభుత్వ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



- అధికారులకు కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశం

**గుంటూరు, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** అమరావతిలో కేంద్ర ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి, నిర్ణీత గడువులోగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కేంద్ర ప్రజా నిర్మాణ శాఖ (సీపీడబ్ల్యూడీ) చీఫ్ ఇంజనీర్ సి.ఎన్. సురేష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్‌ను కలిసి అమరావతిలో చేపట్టనున్న కేంద్ర ప్రభుత్వ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

సమావేశంలో అమరావతిలో నిర్మించనున్న సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకమోడేషన్ ప్రాజెక్టు పురోగతి, టెండర్ల ప్రక్రియ, నిర్మాణ కార్యాచరణపై అధికారులు వివరించారు. రూ.1,299.08 కోట్ల అంచనా వ్యయంతో రాయపూడి గ్రామంలో 5.53 ఎకరాల విస్తీర్ణంలో 2,16,032 చదరపు మీటర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను సెప్టెంబర్ తొలి వారంలో పిలవనున్నట్లు వెల్లడించారు. జీ౦13 అంతస్తులతో ఒక బ్లాక్, జీ౦10 అంతస్తులతో మరో బ్లాక్ నిర్మించి సుమారు 8 వేల మంది అధికారులు, ఉద్యోగులకు కార్యాలయ వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

అదేవిధంగా జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకమోడేషన్ ప్రాజెక్టును రూ.1,234.91 కోట్ల అంచనా వ్యయంతో ఇనవోలు గ్రామంలో 17 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. 2,90,762 చదరపు మీటర్ల నిర్మాణ విస్తీర్ణంలో రెండు బేస్‌మెంట్‌లతో 11 టవర్లు, మొత్తం 1,504 నివాస గృహాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను ఆగస్టు తొలి వారంలో పిలవనున్నట్లు తెలిపారు.

ఈ రెండు ప్రాజెక్టులను 2029 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భవనాలను GRIHA 4–స్టార్ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నట్లు వివరించారు.

అదేవిధంగా ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) భవన నిర్మాణం పూర్తై ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని తెలిపారు. బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, కెనరా బ్యాంక్ భవనాలను 2028 జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. నాబార్డ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా భవనాల నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించి అదే గడువులో పూర్తి చేయనున్నట్లు చెప్పారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ కార్యాలయం, విదేశ్ భవన్ (ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం), న్యూ ఇండియా అష్యూరెన్స్ కంపెనీ భవనాలను 2028 జూలై నాటికి సిద్ధం చేయనున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ నిర్మాణ ప్రాజెక్టులు కీలక మైలురాయిగా నిలుస్తాయని అన్నారు. నిర్ణీత గడువుకు ముందే అన్ని పనులు పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పనుల అమలులో ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని, కేంద్ర--రాష్ట్ర శాఖల మధ్య సమన్వయం కోసం అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాల ప్రదానం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కుటుంబ సంక్షేమ కార్యక్రమాల అమలులో విశేష కృషి చేసిన వైద్యాధికారులు, గర్భిణీ స్త్రీలను వంద శాతం ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్)తో అనుసంధానం చేసిన ఆరోగ్య కార్యకర్తలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ప్రశంసించారు.

ఈ సందర్భంగా కలెక్టరేట్లోని డి ఆర్ సి హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన ప్రోగ్రాం ఆఫీసర్స్ డా. ఈ. అన్నపూర్ణ, డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖఅధికారి, తెనాలి, డా. కె. సుజాత, డీ.పీ.ఎం. ఓ లకు జాయింట్ కలెక్టర్ ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలులో వారి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రభుత్వం చేపడుతున్న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేసేందుకు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రతి అర్హురాలిని ABHAతో అనుసంధానం చేయడంలో సిబ్బంది చూపిన అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. విజయలక్ష్మి, ప్రశంసా పత్రములు పొందిన వైద్యులు డా. గోవిందనాయక్, డా. రేష్మ, డా. శ్రీవల్లి, డా. శ్రీధర్, డా. భార్గవ్, డా. అనూష, డా. పద్మలత, డా. సతీష్ పాల్గొన్నారు.

# సర్కారు బడులకే విద్యార్థుల క్యూ

(మొదటి పేజీ తరువాయి)

**తల్లిదండ్రుల కలల సాకార వేదిక మెగా పీటీఎం :** మన ఇంట్లో కొడుకు అయినా... కూతురు అయినా... మొదటిసారి పాఠశాలకు వెళ్లే రోజు ప్రతి తల్లిదండ్రి కళ్లలో ఆనందం ఉంటుంది... అదే సమయంలో ఒక చిన్న ఆందోళన కూడా ఉంటుంది. నా బిడ్డ బాగా చదువుకోవాలి... మంచి మనిషిగా ఎదగాలి... జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలనే ఆశ ప్రతి తల్లిదండ్రి గుండెల్లో ఉంటుంది. ఆ ఆశను నమ్మకంగా... ఆ కలను నిజంగా మార్చే వేదికే మన మెగా పీటీఎం. ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది తల్లిదండ్రులు పాఠశాలలకు రావడం చూస్తుంటే... ఇది ఒక ప్రభుత్వ కార్యక్రమంలా అనిపించడం లేదు... ఒక కుటుంబ వేడుకలా ఉంది. నేను విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రోజు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారికి ఒక హామీ ఇచ్చాను. ప్రభుత్వ పాఠశాలలకు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తానని మాట ఇచ్చాను. ఈరోజు ఆ హామీని నిలబెట్టుకునే ప్రయాణంలో మొదటి అడుగు పడింది. ఈ ప్రయాణంలో నాతో పాటు నడిచిన ప్రతి ఉపాధ్యాయుడికి... ప్రతి తల్లిదండ్రికి... ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**త్యాగధనులు పుట్టిన నేల రంపచోడవరం :** రంపచోడవరం వచ్చిన తరువాత కొత్త ఉత్సాహం వచ్చింది. ఈ నేలలో వీరత్వం ఉంది...త్యాగం ఉంది. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు గారు నడిచిన గొప్ప నేల రంపచోడవరం. గిరిజనుల ఆత్మగౌరవ పోరాటానికి సాక్ష్యం ఈ గడ్డ. రంపచోడవరం అడవుల్లో అల్లూరి సీతారామరాజు గారు స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించారు. ఆ జ్యోతి దేశ భక్తిగా మారింది. ఇక్కడికి వచ్చినప్పుడు పచ్చని అడవితల్లి స్వాగతం పలికింది. గిరిజనుల ఆత్మీయత మరిచిపోలేను. మెగా పీటీఎం మొదలు పెట్టినప్పుడు నుంచి ఒక్కో ప్రాంతంలో జరుపుకుంటున్నాం. ఈ మెగా పీటీఎం గిరిజన ప్రాంతం అయిన రంపచోడవరంలో జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను.

**కనిపించే దేవుళ్లు టీచర్లు, తల్లిదండ్రులు :** మనం దేవుడిని చూడకపోయినా ఉన్నాడని నమ్ముతాం. ఎందుకంటే ప్రేమ ఉన్న చోట దేవుడు ఉంటాడు, సేవ ఉన్నచోట దేవుడు ఉంటాడు, త్యాగం ఉన్న చోట దేవుడు ఉంటాడు. మన లైఫ్ లో అలాంటి దేవుళ్ళు ఇద్దరే ఉన్నారు. మన మొదటి దేవుళ్లు తల్లిదండ్రులు, మన జీవితానికి దారి చూపించే దేవుళ్లు ఉపాధ్యాయులు.



అందుకే ప్రతి మెగా పీటీఎంలో మనం ఒక అందమైన సంప్రదాయాన్ని ప్రారంభించాం. 'తల్లికి వందనం'... ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు... మనకు జన్మనిచ్చిన తల్లికి, మన భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞత చెప్పడం. పిల్లలూ... ఇప్పుడు మీ అందరినీ ఒక చిన్న కోరిక కోరుతున్నాను. మీ అమ్మగారి పాదాలకు నమస్కారం చేయండి. అమ్మకు నమస్కారం చేయడం అంటే... దేవుడికి నమస్కారం చేసినట్టే. అలాగే మీ ఉపాధ్యాయులను, మీ తల్లిదండ్రులను, మీ పెద్దలను ఎప్పుడూ గౌరవించండి. ఆ గౌరవమే మీ జీవితంలో గొప్ప విజయాలకు పునాది అవుతుంది. తల్లి ఆశీస్సులు ఉంటే విజయానికి అడ్డు ఉండదు. గురువు ఆశీస్సులు ఉంటే భవిష్యత్తు బాగుంటుంది.

**టీచర్ వల్లే అబ్దుల్ కలాం ఉన్నతస్థానానికి :** డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు చిన్నప్పుడు ఒక సాధారణ కుటుంబంలో పెరిగారు. తన జీవితంలో ఇద్దరు వ్యక్తులు నాకు గొప్ప బలం ఇచ్చారు... నా తల్లి... నా గురువు అని అబ్దుల్ కలాం గారు చెప్పారు. తల్లి మంచి విలువలు నేర్పింది... గురువు పెద్ద కలలు కనడం నేర్పారు. ఒక రోజు ఆయన టీచర్ సుబ్రహ్మణ్య అయ్యర్ పక్షులు ఎలా ఎగురుతాయో పుస్తకంలో చెప్పి ఆపలేదు. పిల్లలందరినీ సముద్ర తీరానికి తీసుకెళ్లి ప్రత్యక్షంగా చూపించారు. ఆ రోజు కలాం గారి మనసులో విమానాలపై ఆసక్తి పుట్టింది. అదే ఆసక్తి ఆయనను ఏరోస్పేస్ ఇంజనీర్‌గా... క్షిపణి శాస్త్రవేత్తగా... చివరకు భారత రాష్ట్రపతిగా తీర్చిదిద్దింది. ఒక మంచి ఉపాధ్యాయుడు ఒక పాఠాన్ని మాత్రమే చెప్పడు... జీవితానికి దిశ చూపిస్తాడు. ఆ ఇద్దరూ లేకపోతే అబ్దుల్ కలాం రాష్ట్రపతి కాలేకపోయేవారు. ప్రతి గొప్ప వ్యక్తి వెనుక ఒక గొప్ప తల్లి... ఒక గొప్ప గురువు ఉంటారు.

**నా భవిష్యత్తు మీ చేతుల్లోనే..! :** నేను విద్యా శాఖ మంత్రి అయిన రెండేళ్ల తరువాత మీరంతా నాకు ఒక కిక్ మూమెంట్ ఇచ్చారు. నేను మొదటి పీటీఎం రోజు చెప్పాను టెన్త్, ఇంటర్ రిజల్ట్స్ వచ్చినప్పుడు 111, 222, 333, ర్యాంక్స్ అన్నీ మావే అని ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు యాడ్స్ ఇస్తాయి. అలాంటి రిజల్ట్స్ మేము సాధిస్తాం అటువంటి యాడ్ ఇస్తాం అని. నా కోరిక మీరు తీర్చారు. ఈ ఏడాది వచ్చిన టెన్త్ అండ్ ఇంటర్ రిజల్ట్స్ లో మన పిల్లలు రికార్డులు బద్దలు కొట్టారు. ఇచ్చిన మాట ప్రకారం చరిత్ర లో మొదటి సారి టెన్త్ అండ్ ఇంటర్ లో ర్యాంక్స్ సాధించిన పిల్లల ఫొటోలతో యాడ్స్ ఇచ్చాం. అందులో ముఖ్యమంత్రి గారి ఫోటో లేదు, నా ఫోటో లేదు. ఇది నా విజయం కాదు.. ఇది ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లిదండ్రులు విజయం. మన పిల్లల ఫోటోలను పేపర్ లో , టివిలో చూసినప్పుడు నాకు నిజంగా కిక్ వచ్చింది. మీరు బాగా చదివి మంచి మార్కులు సాధిస్తేనే నాకు సీఎం గారు మంచి మార్కులు వేస్తారు. మీరు పరీక్ష తప్పితే సీఎం గారు నాకు మైనస్ మార్కులు వేస్తారు. మీ మార్కులే... నా ప్రోగ్రెస్ రిపోర్ట్. నా ప్రోగ్రెస్ రిపోర్ట్ మాత్రం మీ చేతిలో ఉంటుంది. నా భవిష్యత్తు మీ చేతిలో ఉంది.

**మహిళలను అవమానిస్తే సహించేదిలేదు :** విలువలతో కూడిన విద్య అవసరం. అందుకే మనం చాగంటి కోటేశ్వరరావు గారిని అడ్వైజర్ గా నియమించుకున్నాం. ఆయన చెప్పిన ఒక మాట నాకు బలంగా గుర్తుండిపోయింది. తల్లికి చెప్పలేని పని ఏదీ చెయ్యొద్దు అన్నారు. వినడానికి చాలా సింపుల్ గా ఉంటుంది. కానీ అర్థం చేసుకుంటే అందులో చాలా పవర్ ఫుల్ మెసేజ్ ఉంది. ఆయన రాసిన విలువల పుస్తకాలు మనం విద్యార్థులకు అందిస్తున్నాం. ఈ సందర్భంగా మీకు ఒక ముఖ్యమైన విషయం చెబుతాను. మహిళలను గౌరవించడం మన ఇంటి నుండి మొదలవ్వాలి. ఇప్పటికీ కొంత మంది మహిళల్ని కించపరుస్తూ మాట్లాడతారు. అమ్మాయిలా ఏడవొద్దు, చీర కట్టుకున్నావా, గాజులు వేసుకున్నావా అని మహిళల్ని అవమానపరుస్తూ మాట్లాడతారు. అలాంటి మాటలు ఎవరు మాట్లాడినా వద్దు అని గట్టిగా చెప్పండి. మహిళల జోలికొస్తే లోకేష్ అన్న తోలు తీస్తాడు అని వార్నింగ్ ఇవ్వండి.

**చదువుకు దూరం కావద్దనే తల్లికి వందనం :** ఏ బిడ్డా చదువుకి దూరం కాకూడదు అనేది మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి ఆశయం. అందుకే ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం ఇస్తున్నాం. 2025 లో 67.27 లక్షల మందికి 10,090 కోట్లు ఇచ్చాం. 2026 లో 67.47 లక్షల మందికి 10,120 కోట్లు ఇచ్చాం. ఇంట్లో ఇద్దరు పిల్లలు ఉంటే ఒకరు చదువుకోవాలి ఇంకొకరు పనికి వెళ్ళాలి అనేది గత ప్రభుత్వ విధానం. కానీ మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారు మాత్రం ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నారు. వెంటనే మేలుకోండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు ఆగకండి అని స్వామి వివేకానంద చెప్పిన మాటలను త్రికరణశుద్ధితో పాటిస్తూ ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ "లీప్" కోసం కృషి చేస్తున్నాం. వన్ క్లాస్ వన్ టీచర్ మన బలం. సుమారుగా 10 వేల స్కూల్స్ లో వన్ క్లాస్ వన్ టీచర్ విధానం అమలు చేస్తున్నాం.

**విద్యాసంస్థల్లో నో పాలిటిక్స్ :** స్కూల్ అండ్ కాలేజీల్లో నో పాలిటిక్స్. పుస్తకాల దగ్గర నుండి స్కూల్స్ వరకూ ఎక్కడ సీఎం గారి ఫోటో లేదు, నా ఫోటో లేదు. మెగా డిఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసాం. టీచర్ ట్రాన్స్ఫర్ యాక్ట్ తీసుకొచ్చాం. డొక్కా సీతమ్మ పేరుతో రీజియన్ బేస్డ్ మెనూతో మధ్యాహ్నభోజన పథకం అమలు చేస్తున్నాం. త్వరలోనే రాష్ట్రం మొత్తం స్మార్ట్ కిచెన్స్ ఏర్పాటు చేస్తాం. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో స్టూడెంట్ కిట్స్ అందిస్తున్నాం. స్టూడెంట్ ఓవర్ ఆల్ డెవెలప్మెంట్ కోసం శనివారం నో బ్యాగ్ డే అమలు చేస్తున్నాం. పాసివ్ లెర్నింగ్ నుండి యాక్టివ్ లెర్నింగ్ కి మార్చడానికి క్లిక్కర్ మోడల్ తీసుకొచ్చాం. ఖీచీ – అమలు చేస్తున్నాం. లెర్నింగ్ అవుట్ కమ్ ఒక్కటే టార్గెట్ గా పెట్టుకున్నాం. లీప్ యాప్ తీసుకొచ్చాం. పాఠశాలల్లో ఎంత చదువు చెప్పినా ఇంటి దగ్గరకు వచ్చిన తరువాత తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలి. లీప్ యాప్ లో మొత్తం వివరాలు వస్తాయి. ఇంటర్ విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్, మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నాం. పిల్లలకు మనం ఆస్తులు ఇవ్వకపోయినా పర్వాలేదు...మంచి విద్య ఇవ్వాలి. పెద్ద పెద్ద భవనాలు కట్టకపోయినా పర్వాలేదు...పెద్ద కలలు కనడం నేర్పాలి. డబ్బు ఇవ్వకపోయినా పర్వాలేదు...ధైర్యం ఇవ్వాలి. ఎందుకంటే...ఆస్తి ఒక తరాన్ని మాత్రమే నిలబెడుతుంది. విద్య తరతరాలను నిలబెడుతుంది. మన పిల్లల భవిష్యత్తు కోసం... మన రాష్ట్ర భవిష్యత్తు కోసం... మనమందరం కలిసి ముందుకు సాగుదామని మంత్రి లోకేష్ అన్నారు.

# రాష్ట్ర వైద్యానికి 'సంజీవని' జవసత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు 10.51 లక్షల మందికి సమగ్ర డిజిటల్ ఆరోగ్య ఖాతాలను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. 10.06 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య ఖాతాలను (ఆభా) అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. రోగి ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి వెళ్లినప్పుడు గత వైద్య చరిత్ర, పరీక్షల వివరాలు, మందులు, చికిత్స సమాచారం క్షణాల్లో వైద్యులకు అందుబాటులోకి వచ్చే విధంగా వ్యవస్థను అభివృద్ధి చేశామని వివరించారు.

సంజీవని ద్వారా ప్రతి వ్యక్తికి ప్రత్యేక డిజిటల్ ఆరోగ్య ఖాతా రూపొందిస్తున్నామని, గతంలో వచ్చిన వ్యాధులు, వైద్యుల సూచనలు, ప్రయోగశాల పరీక్షల ఫలితాలు, మందుల వినియోగం, ఆస్పత్రి చికిత్సలు, తదుపరి వైద్య సూచనలన్నీ ఒకే వేదికపై నమోదు అవుతాయని తెలిపారు. దీంతో రోగులు పాత వైద్య నివేదికలు వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదని, గత చికిత్స వివరాల ఆధారంగా వైద్యులు త్వరగా చికిత్స అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని తొలుత 2025 జూలై 3న చిత్తూరు జిల్లా కుప్పంలో ప్రారంభించగా, అనంతరం నారావారిపల్లెతో పాటు చిత్తూరు జిల్లా అంతటా దశలవారీగా విస్తరించినట్లు మంత్రి తెలిపారు. ఇటీవల ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పీహెచ్‌సీ పరిధిలో కూడా అమలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.



ఇప్పటివరకు 10.51 లక్షల సమగ్ర ఆరోగ్య ఖాతాలు రూపొందించగా, 3.62 లక్షల మందికి వైద్యుల అపాయింట్‌మెంట్లు కల్పించినట్లు తెలిపారు. 2.48 లక్షల మంది రోగులు వైద్యులను సంప్రదించగా, 14.66 లక్షల మందుల పంపిణీ, 31,555 ల్యాబ్ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. 1.60 లక్షల మంది రోగులకు ఫాలోఅప్ వైద్యం గురించి ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు చెప్పారు. డిజిటల్ నర్వ్ సెంటర్‌లోని ఎంబీబీఎస్ వైద్యులు, నిపుణులు కలిపి సుమారు 7 వేల మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు వివరించారు.

రోగిని ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి రిఫర్ చేసిన తర్వాత కూడా అతను అక్కడకు చేరాడా, వైద్యుడిని కలిశాడా, పరీక్షలు చేయించుకున్నాడా, మందులు వాడుతున్నాడా, ఫాలోఅప్‌కు హాజరయ్యాడా అనే వివరాలను కూడా సంజీవని ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి తెలిపారు. రిఫరల్ సేవలు, టెలిమెడిసిన్, నిపుణుల సూచనలు, ప్రయోగశాల పరీక్షలు, మందుల పంపిణీ, తదుపరి అపాయింట్‌మెంట్లు, ఫాలోఅప్ సేవలను ఒకే డిజిటల్ వ్యవస్థతో అనుసంధానం చేశామని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అసంక్రమిత వ్యాధుల గుర్తింపు కార్యక్రమం (ఎన్‌సీడీ–4.0) కింద సేకరించిన 2.72 కోట్ల మంది ఆరోగ్య వివరాలను కూడా సంజీవనితో అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. దీని ద్వారా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, చికిత్సను నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) కింద విద్యార్థుల ఆరోగ్య పరీక్షల వివరాలు, గర్భిణుల నమోదు, ప్రసవపూర్వ పరీక్షలు, హైరిస్క్ గర్భిణుల వివరాలను కూడా ఈ వ్యవస్థలో చేర్చనున్నట్లు తెలిపారు.

ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సుమారు 35 వేల మందిని సంజీవని పరిధిలోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. రోగి ఎక్కడ చికిత్స పొందినా వైద్య సేవల్లో అనుసంధానం ఉండాలని, ఒక ఆస్పత్రి నుంచి మరో ఆస్పత్రికి పంపించడంతో బాధ్యత ముగిసినట్లు కాకుండా చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షణ కొనసాగించడమే సంజీవని ప్రధాన లక్ష్యమని సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల కాకుమాను నందు (మెగా పేరెంట్ – టీచర్ మీటింగ్ ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా ఎంపీటీఎం స్పెషల్ ఆఫీసర్ డి. వందనం కాకుమాను మండల విద్యా శాఖ అధికారి కె. ఎఫ్. కెన్నెడీ కాకుమాను సబ్–ఇన్‌స్పెక్టర్ హరి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఎస్ ఎం సి చైర్‌పర్సన్,ఎస్ ఎం సి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక పోలీసు శాఖ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, విజేతలకు మొదటి మూడు స్థానాలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి విద్యా ప్రాముఖ్యత, విద్యార్థుల భవిష్యత్ లక్ష్యాలు, క్రమశిక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన, తల్లిదండ్రుల బాధ్యతలు వంటి అంశాలపై విలువైన సూచనలు, సలహాలు అందించారు.

2025–26 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఎస్ ఎస్ సి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు సబ్జెక్టులో 100/100 మార్కులు సాధించిన విద్యార్థినులకు, సంబంధిత పీజీటీ తెలుగు ఉపాధ్యాయురాలు టి. పూర్ణకుమారి ప్రోత్సాహకంగా రూ.10,000/– నగదు బహుమతిని స్పెషల్ ఆఫీసర్ డి. వందనం చేతుల మీదుగా అందజేశారు. 2026–27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మిషన్ మార్చ్ కార్యక్రమం ప్రాముఖ్యత, లక్ష్యాలు మరియు అమలు విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ హవిలా ప్రియదర్శిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వేదికపై ఏపీ ప్రభుత్వ వైద్య కళాశాలల ఘనత

- పోలియో టీకాపై కీలక పరిశోధనకు 'ది లాన్సెట్' గుర్తింపు'
- ఆంధ్ర, కర్నూలు మెడికల్ కాలేజీలకు అంతర్జాతీయ గౌరవం..
- పరిశోధక వైద్యులు చక్రవర్తి, విజయానంద్ కు మంత్రి సత్య కుమార్ అభినందనలు..
- ఇదే స్ఫూర్తిని మిగిలిన కళాశాలలు కూడా కొనసాగించాలని మంత్రి ఆకాంక్ష

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రపంచస్థాయి వైద్య పరిశోధనల్లో తమ ప్రతిభను చాటాయి. చిన్నారులకు ఇచ్చే పోలియో టీకాపై నిర్వహించిన కీలక అంతర్జాతీయ పరిశోధన ప్రపంచ ప్రఖ్యాత ది లాన్సెట్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ జర్నల్‌లో ఈ ఏడాది లిమే 15న ప్రచురితమైంది. దేశంలోని తొమ్మిది ప్రముఖ వైద్య విద్యా సంస్థలు పాల్గొన్న ఈ బహుళ కేంద్రాల అధ్యయనంలో విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్–కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్), కర్నూలు మెడికల్ కాలేజ్‌లిలి కీలక భాగస్వాములుగా నిలవడం రాష్ట్ర వైద్య విద్య, పరిశోధన రంగాలకు మరో అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చింది.

**643 మంది శిశువులపై అధ్యయనం :** ఈ పరిశోధనను సుమారు రెండేళ్లపాటు ఫేజ్–2/3, డబుల్–బ్లైండ్, ర్యాండమైజ్డ్ కంట్రోల్డ్ క్లినికల్ ట్రయల్‌గా నిర్వహించారు. తొలి దశలో 100 మంది శిశువులపై, అనంతరం మొత్తం లి643 మంది శిశువులపై అధ్యయనం చేపట్టారు.



విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్--కేజీహెచ్‌లో డా చక్రవర్తి గారి ఆధ్వర్యం లో వంద మందికి పైగా చిన్నారులు ఈ పరిశోధనలో పాల్గొన్నారు..ఈ పరిశోధన లో కీలక భూమిక పోషించింది.కర్నూలు మెడికల్ కాలేజ్ కూడా ఈ పరిశోధన లో తన పాత్ర చక్కగా నిర్వహించింది.

**తొమ్మిదిలో రెండు మన కళాశాలలే... :** ఈ బహుళ కేంద్రాల పరిశోధనకు లిసీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, పుణెలి సమన్వయ సంస్థగా వ్యవహరించింది. ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ (కోల్‌కతా), పీజీఐఎంఈఆర్ (చండీగఢ్), టోపీవాలా నేషనల్ మెడికల్ కాలేజ్–నాయర్ ఆసుపత్రి (ముంబయి), భారతి విద్యాపీఠ్ మెడికల్ కాలేజ్ (పుణె), మైసూరు మెడికల్ కాలేజ్, ఐఎంఎస్–సమ్ హాస్పిటల్ (భువనేశ్వర్)తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఆంధ్ర మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కాలేజ్‌లను అధ్యయన కేంద్రాలుగా ఎంపిక చేయడం విశేషం.

ప్రభుత్వ వైద్య కళాశాలలు దేశంలోని అత్యుత్తమ వైద్య సంస్థల సరసన నిలిచి ప్రపంచ స్థాయి పరిశోధనలో భాగస్వాములు కావడం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది.

**వ్యయం తగ్గే అవకాశం:** ఈ అధ్యయనంలో ప్రస్తుతం వినియోగిస్తున్న ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ లిలితో పోలిస్తే కేవలం లిలినాలుగో వంతు () యాంటిజెన్ కలిగిన లిడోస్–స్పేరింగ్ ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్ లిను పరీక్షించారు. తక్కువ యాంటిజెన్‌తో తయారైన ఈ టీకా కూడా పూర్తి మోతాదు టీకాతో సమానమైన రోగనిరోధక శక్తిని కలిగిస్తుందని, మూడు రకాల పోలియో వైరస్‌లపైనా సమర్థవంతంగా పనిచేస్తుందని పరిశోధనలో తేలింది. భద్రత పరంగానూ తీవ్రమైన దుష్ప్రభావాలు నమోదు కాలేదు. దీంతో తక్కువ మోతాదులోనే ఎక్కువ టీకా డోసులు తయారు చేయడం సాధ్యమై, ప్రపంచవ్యాప్తంగా టీకాల లభ్యత పెరగడంతో పాటు ప్రభుత్వాల వ్యయం కూడా తగ్గే అవకాశం ఉందని పరిశోధకులు వెల్లడించారు.

**డా. చక్రవర్తి, డా విజయానశీద్ ల కృషి :** ఈ పరిశోధనలో లిఆంధ్ర మెడికల్ కాలేజ్ చిన్నారుల వైద్య విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, కర్నూలు మెడికల్ కాలేజ్ పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ ఆనంద్‌లి అంతర్జాతీయ పరిశోధక బృందంలో సభ్యులుగా పనిచేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల అధ్యాపకులు ప్రపంచస్థాయి క్లినికల్ పరిశోధనల్లో కీలక బాధ్యతలు నిర్వహించడం రాష్ట్ర పరిశోధనా సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.

కొద్దికాలం కిందట ఆంధ్ర మెడికల్ కాలేజ్ , పిల్లల వైద్య విభాధిపతి డా చక్రవర్తి ఆధ్వర్యం లో కలరా, టైఫాయిడ్, న్యుమోనియా టీకాలపై నిర్వహించిన అంతర్జాతీయ పరిశోధనలకు కూడా గుర్తింపు లభించింది.

**పరిశోధనలకు ప్రాధాన్యం:మంత్రి :** రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్య, వైద్య సేవలు, పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లిశ్రీ సత్యకుమార్ యాదవ్‌లి తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు, క్లినికల్ పరిశోధనలకు అవసరమైన వాతావరణం, అధ్యాపకులకు ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు. "ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వైద్య జర్నళ్లలో ఒకటైన 'ది లాన్సెట్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్'లో ఆంధ్ర మెడికల్ కాలేజ్, కర్నూలు మెడికల్ కాలేజ్ భాగస్వామ్యంతో పరిశోధన ప్రచురితమవడం రాష్ట్ర వైద్య రంగానికి గర్వకారణమ"ని పేర్కొన్నారు. పరిశోధక వైద్యులు డాక్టర్ చక్రవర్తి డాక్టర్ విజయనశీద్ ల బృందానికి అభినందనలు తెలిపారు.

## వీధి నిర్వహణలో ఉన్న విలేఖరులపై దాడులు సిగ్గు చేటు.మీడియా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి:టియుడబ్ల్యూజే నాయకుల డిమాండ్





రాజేంద్రనగర్,జులై24(జర్నలిస్ట్‌ఫైల్):

ఆందోళనలు,ప్రజా ఉద్యమాలు,నిరసనలు ప్రజాస్వామ్య హక్కులేనని, అయితే విధి నిర్వహణలో ఉన్న పత్రిక,మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం సరైంది కాదని టియూడ బ్లూజే (హెచ్ 143) రంగారెడ్డి జిల్లా అధ్యక్షా కార్యదర్శులు ఉపరి శేఖర్ సాగర్,గాదం రమేష్,కోశాధికారి పి.వెంకటేష్ లు అన్నారు.బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కొందరు రాళ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రజలకు,ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలుస్తూ,అన్ని రాజకీయ పార్టీల కార్యకలాపాలను నిష్పాక్షపాతంగా ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టులపై తరచూ దాడులు జరగడం ఆందోళనకరమన్నారు.ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా,పత్రిక విలేకరులపై దాడులు జరుగడం విచారకరమన్నారు.విలేకరులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఓటు ప్రతి ఒక్కరి బాధ్యత : బి ఎల్ ఓ కిషోర్



వైరా,జూలై 24(జర్నలిస్ట్‌ఫైల్):

వైరా మున్సిపాలిటీ పరిధిలో 20 వ వార్డ్ శాంతి నగర్, పోలింగ్ స్టేషన్ 176 పరిధి లో నిర్వహించిన సర్ కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయింది.ఈ ముగింపు కార్యక్రమం సందర్భంగా బి ఎల్ వో టీమ్ ఎం కిషోర్ మాట్లాడుతూ మొత్తం 728 ఓట్లు సర్వే చేయగా అందులో మరణించిన వారు 13,డబల్ 4,షిఫ్ట్ అయినవి 37 మొత్తం 54 ఓట్లు తొలగించగా ప్రస్తుతం 674 మంది ఓటర్లు ను ఇఫ్ డిజిటల్ చేయాడం జరిగింది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన తేదీ కంటే ముందుగానే కంప్లీట్ చేసిన బీ ఎల్ ఓ కిషోర్ గ అభినందించి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ కంటి హాస్పిటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు స్కూల్ టీచర్స్ రామకృష్ణ రెడ్డి ,కరుణ ,వి ఏ బేగ్ ముస్తఫా,బిక్యా ,షకీల్,తేజావత్ కుసుమ,యడ్లపృథ్వి,బోజ రాజు,సోరి తదితరులు పాల్గొన్నారు

## ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించిన కమీషనర్




ఖమ్మం, జూలై 24(జర్నలిస్ట్‌ఫైల్):

కమిషనర్ గారు దానవాయిగూడెంలోని ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను ఖమ్మం కమీషనర్ పరిశీలించారు. 2024 సెప్టెంబర్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా నీటమునిగిన ఎఫ్ఎస్‌టీపీని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పునరుద్ధరించి తిరిగి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చింది.ఈ సందర్భంగా ఎఫ్ఎస్‌టీపీలో పనిచేస్తున్న కార్మికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహించే సమయంలో ప్రతి కార్మికుడు తప్పనిసరిగా పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ కిట్లు ధరించి సురక్షితంగా పనిచేయాలని సూచించారు.అదేవిధంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ తరపున కార్మికులకు పిపిఈ కిట్లు, రూ.5 లక్షల ప్రమాద బీమా (ఇన్సూరెన్స్) కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రతిరోజూ 10 నుండి 15 సెప్టిక్ ట్యాంకర్ల ద్వారా వచ్చే మలిన వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయడానికి అవసరమైన వనరులు, సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎఫ్ఎస్‌టీపీలో రోజుకు సుమారు 70 కిలోలీటర్ల (కేఎల్ డి) మలిన వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. ఏ రోజు వచ్చిన మలిన వ్యర్థాలను అదే రోజు ప్రాసెసింగ్ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.ప్రతి కార్మికుడు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ నగర పరిశుభ్రతలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నగరంలోని అన్ని సెప్టిక్ ట్యాంకుల మలిన వ్యర్థాలు తప్పనిసరిగా ఎఫ్ఎస్ టిపి కు చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ఎఫ్ఎస్ టిపి ను సమర్థవంతంగా నిర్వహించి ప్రతిరోజు వచ్చిన మలిన వ్యర్థాలను అదే రోజు శుద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన ఖమ్మం నగర నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డిఈఈ) శ్రీనివాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నరేంద్ర తేజ, సివిఆర్ జేవి ఎం.డి. త్రిభువన్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్, ప్లాంట్ సూపర్వైజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు




భద్రాచలం, జూలై 24(జర్నలిస్ట్‌ఫైల్):

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు గురువారం ఉదయం 08.00 గంటల నుండి 10.00 గంటల వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఏకకాలంలో ప్రత్యేక నాకాబందీ నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా ప్రతిష్టమైన ప్రణాళికతో వాహన తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, పాత నేరస్తులను కనుగొనడానికి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు చేపట్టడం జరిగిందని తెలియజేశారు.గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టడం,రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను చేపట్టడం,పాత నేరస్తులను కనిపెట్టే విధంగా ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా ప్రతి ఒక్కరి వేలిముద్రలను తనిఖీలు చేయడం జరిగిందని అన్నారు జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులు, ముఖ్య రహదారులు, గ్రామాల్లో ఈ నాకాబందీ నిర్వహించబడిందన్నారు.ఈ ప్రత్యేక తనిఖీలలో మొత్తం 3714 వాహనాలను తనిఖీ చేశారు. వీటిలో 2384 ద్విచక్ర వాహనాలు, 987 నాలుగు చక్రాల వాహనాలు, 434 లారీలు ఉన్నాయి.తనిఖీల సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 510 మంది, నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన లేదా నంబర్ ప్లేట్ లేని 308 వాహనాలు, హెల్మెట్ ధరించని 524 మంది, సీటు బెల్ట్ ధరించని 106 మంది, మైనర్లు నడిపిన 14 వాహనాలు, అక్రమంగా సైలెన్సర్ మార్పులు చేసిన 4 వాహనాలను గుర్తించారు. ఈ తనిఖీల్లో 07 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే 15 అనుమతి లేని వాహనాలను స్వాధీనం చేసుకోగా, తనిఖీల్లో చోరీకి గురైన ద్విచక్ర వాహనాని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 7 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడం జరిగింది.నిబంధనలు ఉల్లంఘించిన వారి వాహనాలపై 764 స్పాట్ చల్లనలను విధించగా, 1567 వాహనాల నుండి జరిమానా వసూలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్‌తోనే వాహనాలు నడపాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక నాకాబందీ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.అలాగే అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా మాజీ ఎంపీ నామ శుభాకాంక్షలు



ఖమ్మం, జూలై 24(జర్నలిస్ట్‌ఫైల్):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినం (జూలై 24) సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మీడియా కు ఒక ప్రకటన విడుదల చేసారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో, ముఖ్యంగా ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాల్లో కేటీఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాం లో ప్రపంచస్థాయి పెట్టుబడులను తెలంగాణకు ఆకర్షించి, హైదరాబాద్‌ను ప్రముఖ ఐటీ, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న యువ నాయకుడు కేటీఆర్ అని కొనియాడారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తే నాయకత్వం ఆయనదని తెలియజేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరాలు, మొక్కల నాటడం, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, సైకిల్ పంపిణీ, నిరుపేదలకు సహాయం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను చేపట్టాలనే కేటీఆర్ ఆలోచన యువతకు స్ఫూర్తిదాయకమని వెల్లడించారు. రానున్న రోజుల్లో కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మరింత బలోపేతం కావాలని, తెలంగాణ ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. కేటీఆర్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు నామ తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బిజెపి--- ప్రశ్నిస్తే గాంధీ భవన్ పై దాడి



ఖమ్మం,జూలై 24(జర్నలిస్ట్‌ఫైల్):

దేశంలో ప్రస్తుతం నెలకొన్న నీట్ పరీక్ష అవకతవకలు, పేపర్ లీకేజీలు, నిరుద్యోగం, నిత్యావసర ధరల పెరుగుదలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది విద్యార్థుల కష్టాన్ని, కలలను బిజెపి ప్రభుత్వం గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. నీట్ లో జరిగిన అక్రమాలపై సరైన విచారణ చేయకుండా, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు.ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ గాల్లో కలిసిపోయిందని, యువత రోడ్లపైకి వస్తుంటే బిజెపి మాత్రం ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తోందని అన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలతో సామాన్యుడు బతకలేని పరిస్థితి వచ్చిందని తెలిపారు.విద్య, వైద్యాన్ని కార్పొరేట్లకు అప్పగించి పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్న బిజెపి విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోన్న కాంగ్రెస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, అదే విధంగా ఓట్ చోరి,సీటు చోరీకి నిదర్శనంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వంటి నిర్వాహకాలు నిర్వహిస్తూ అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటూ కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కాంగ్రెస్ నాయకులపై దాడులు చేయడం దారుణమని అన్నారు. శాంతియుత మార్గంలో మోడీ ఇంటి వద్ద నిరసన చేస్తున్న లోక్ సభ పక్షనేత ఏ ఐ సి సి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ పై బీజేపీ గుండాలు దాడి చేసి గాయపరచారని ఇది ప్రజాస్వామ్యనికి మాయని మచ్చ గా నిలుస్తుందని అన్నారు. అంతే కాకుండా నీట్ విదార్థులకు న్యాయం చేయమని అడిగినందుకు బిజెపి నేతలు గాంధీ భవన్ పై దాడి చేయడం సిగ్గు మలిన చర్య అని అన్నారు.అక్రమాలు చేస్తాం ఎదురొస్తే దాడీ చేస్తాం అంటే ప్రజలు చూస్తూ ఊరుకోరని త్వరలోనే బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




**కాకినాడ జిల్లా.జగ్గంపేట, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కాకినాడ జిల్లా జగ్గంపేట శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు అమర వీరుడు చంద్రశేఖర్ ఆజాద్, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు.దఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నారావు మాట్లాడుతూ, "దేశమే ప్రధానం -- చీఫ్అశీఆ ఖీఅతీర్" అనే భావనతో స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అంకితం చేసిన మహనీయులను ప్రతి భారతీయుడు నిరంతరం స్మరించుకోవాలని అన్నారు. నేడు దేశ ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛ వారి త్యాగాల ఫలితమేనని పేర్కొన్నారు.ఏబీవీపీ జగ్గంపేట శాఖ కన్వీనర్ సత్యసాయి మాట్లాడుతూ, ప్రజల్లో జాతీయ చైతన్యం, స్వాతంత్ర్య స్ఫూర్తిని పెంపొందించేందుకు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ వినాయక చవితి వంటి సామూహిక ఉత్సవాలను జాతీయోద్యమానికి వేదికగా మలిచారని వివరించారు. అలాగే, చిన్న వయసులోనే తన పేరును లి"ఆజాద్"లిగా మార్చుకుని, బ్రిటిష్ పాలకులకు లొంగిపోకుండా మాతృభూమి గౌరవం కోసం తనకు తానే ఆత్మబలిదానం చేసుకున్న చంద్రశేఖర్ ఆజాద్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల దేశభక్తి, త్యాగస్ఫూర్తిని నేటి విద్యార్థులకు పరిచయం చేసి, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నిరంతరం కృషి చేస్తోందని, వారి స్ఫూర్తితోనే జాతీయ పునర్నిర్మాణ దిశగా విద్యార్థి పరిషత్ పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ భాగ్ కన్వీనర్ జస్వంత్, కార్యకర్తలు శ్రీనివాస్, వీర తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలే నేటి యువతకు మార్గదర్శకం -- డా. ఒమ్మి రఘురామ్




**కాకినాడ జిల్లా.జగ్గంపేట, 24 జర్నలిస్ట్ ఫైల్:** జగ్గంపేట లో శ్రీ స్వామి వివేకానంద విద్యా సంస్థల్లో భారత స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకులు లిలోకమాన్య బాల గంగాధర్ తిలక్లి మరియు లిఅమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్లి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సంస్థల అధినేత డా. ఒమ్మి రఘురామ్ ముఖ్య అతిథిగా పాల్గొని, మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహనీయుల ఆశయాలే నేటి యువతకు మార్గదర్శకం అన్నారు. బాల గంగాధర్ తిలక్ స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని నింపిన మహానాయకుడని, "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే ఆయన నినాదం కోట్లాది భారతీయులకు స్ఫూర్తినిచ్చిందన్నారు.అలాగే అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ అసమాన ధైర్యసాహసాలకు ప్రతీక అని, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహోన్నత విప్లవకారుడని కొనియాడారు. నేటి విద్యార్థులు ఈ మహనీయుల దేశభక్తి, క్రమశిక్షణ, త్యాగనిరతి, ధైర్యం మరియు విలువలను ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించగా, అధ్యాపకులు మహనీయుల జీవిత విశేషాలను వివరించారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో భక్తుల రద్దీ



విజయవాడ, **జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** -ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలావేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి తరలి వస్తున్న భక్తులతో ఆషాఢ సారె తొమ్మిదవ రోజు గురు వారం శ్రీ కనకదుర్గమ్మ వారి సన్నిధిలో మహిళల రద్దీ విపరీతంగా పెరిగింది. సాయంత్రం 5 గంటల వరకు 27 సారె బృందాలు రాగా, 9278 మంది భక్తులు సారెను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనానాయక్ పాల్గొన్నారు. ఉచిత అన్నప్రసాదం, ఉచిత ప్రసాదం సారె బృందాలకు అందజేశారు.

## బోర్ పంపు లో నీళ్లు కేవలం వాడుకకు మాత్రమే



**విజయవాడ, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం నగరంలోని అన్ని బోరు పంపులకు త్రాగునీరు కాదు అనే హెచ్చరిక స్టిక్కర్లను వీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది అతికించారు. విజయవాడ నగరపాలక సంస్థ శుద్ధి చేసి సరఫరా చేసే తాగునీటికి ప్రత్యామ్నాయంగా కొంతమంది ప్రజలు బోరు నీటిని కూడా తాగేందుకు వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. బోరు నీటిని తాగడానికి కాకుండా ఇతర గృహ అవసరాలకు మాత్రమే వినియోగించాలని స్టిక్కర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, బోరు నీటిలో సాధారణంగా టీడీఎస్, హార్డ్నెస్ స్థాయిలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అది తాగడానికి అనుకూలం కాదని తెలిపారు. అటువంటి నీటిని తాగునీటిగా వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రజలు తప్పనిసరిగా విజయవాడ నగరపాలక సంస్థ శుద్ధి చేసి సరఫరా చేసే తాగునీటినే వినియోగించాలని కమిషనర్ సూచించారు.

## విద్యార్థుల్లో వర్షపు నీటి సంరక్షణపై అవగాహన. "క్యాచ్ ది రైన్" కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న వీఎంసీ



**విజయవాడ, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు "క్యాచ్ ది రైన్" అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఉదయం పటమటలోని కేబీసీ జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్)పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాముఖ్యత, ఇంకుడు గుంతలను ఎలా ఏర్పాటు చేయాలి, వర్షపు నీటిని ఎలా సేకరించి భూగర్భ జలాల్లోకి చేరేలా చేయాలి, భూగర్భ జలమట్టాన్ని పెంపొందించడం వల్ల కలిగే ప్రయోజనాలు వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేలా విద్యార్థులు తమ కుటుంబ సభ్యులను చైతన్యపరచాలని సూచించారు.ఈ సందర్భంగా 11 వ శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి బాధ్యతాయుతమైన పౌరులని, పర్యావరణ పరిరక్షణతో పాటు నీటి సంరక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని అన్నారు. "క్యాచ్ ది రైన్" కార్యక్రమం ద్వారా ప్రతి విద్యాసంస్థలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, సమాజంలో వర్షపు నీటి సంరక్షణపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, శానిటరీ సిబ్బంది, విద్యార్థినీ--విద్యార్థులు పాల్గొన్నారు.

## నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రజలకు . 306 ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం ఎమ్మెల్యే బొండా ఉమా



**విజయవాడ, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** 29వ డివిజన్ నేతాజీ కాలనీ 4వ రోడ్డులో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రాంతాల బీ-ఫారం పట్టాదారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీ-ఫారంలో ఉన్న అర్హులందరికీ దశలవారీగా పక్కా రిజిస్ట్రేషన్ కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఉమా మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పట్టాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే తమ లక్ష్యమని గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతోందన్నారు. నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రాంతాల భూములు గతంలో ఇరిగేషన్ క్లాసిఫికేషన్లో ఉండటం వల్ల న్యాయపరమైన, పరిపాలనా పరమైన సమస్యలు ఏర్పడ్డాయని, సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో ఈ ప్రక్రియ కొంత ఆలస్యమైనప్పటికీ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టిందని,ముందుగా ఒరిజినల్ అలాట్మెంట్ పొందిన అర్హులందరికీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభిస్తామని, అనంతరం మిగిలిన సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరిస్తామని. కుటుంబ పరిస్థితులకు అనుగుణంగా భార్య, భర్త, కుమారుడు, కుమార్తె లేదా ఇతర కుటుంబ సభ్యుల పేర్లపై నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తామని ఉమా అన్నారు.రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని, ప్రభుత్వానికి చెల్లించాల్సిన అధికారిక ఫీజులు మాత్రమే బ్యాంకు ద్వారా చెల్లించాలని ప్రజలకు సూచించారు, గతంలో ప్రతిపాదించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వల్ల నేతాజీ కాలనీలోని ఇళ్లకు నష్టం జరిగే అవకాశాన్ని గుర్తించి అధికారులతో చర్చించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు, ప్రజల ఇళ్లను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడమే తమ ప్రభుత్వ విధానమని,రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం అవసరమైన బీ-ఫారం, పట్టా పత్రాలు, ఆధార్ కార్డు, పన్ను రసీదులు, ఇతర సంబంధిత పత్రాల జిరాక్స్ కాపీలను సిద్ధం చేసి స్థానిక నాయకులకు అందజేయాలని కోరారు, వివరాలన్నింటిని సేకరించి దశలవారీగా ప్రతి అర్హ కుటుంబానికి రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పిస్తామని, ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) జారీ కావడం, కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ శాఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ, మంత్రివర్గం తదితర పరిపాలనా ప్రక్రియల కారణంగా కొంత సమయం పట్టినా, ప్రజలకు న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఉమా వివరించారు.ప్రజలకు ఒకసారి మాట ఇస్తే దానిని తప్పకుండా నిలబెడతాం ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి దీ-ఫారంలో ఉన్న ప్రతి అర్హ కుటుంబానికి రిజిస్ట్రేషన్ కల్పించే వరకు వెనక్కి తగ్గేది లేదు, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం మా బాధ్యత అని ప్రజలకు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, సింగం వెంకన్న, పీవీఆర్, 1వ డివిజన్ అధ్యక్షులు కమ్మినేని సురేష్, శ్రీను, వాసు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నేతాజీ కాలనీ, పి.వి. నరసింహారావు రోడ్, తుంగం రాములు వీధి ప్రాంతాలకు చెందిన పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**యూనివర్సల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీకి ఎమ్మెల్యే బొండా ఉమా శుభాకాంక్షలు**



**విజయవాడ, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** 36వ డివిజన్ గాంధీనగర్ కందుకూరి కళ్యాణ మండపంలో టియన్ టియుసి అనుబంధ యూనివర్సల్ మున్సిపల్ వర్కర్స్ ఒ ఎంప్లాయిస్ యూనియన్ నగర శాఖ, వెహికల్ డిపో కమిటీ సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు, ఈ సమావేశంలో నూతన నగర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి హాజరయ్యారు. సభకు టియన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘురామరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితర చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అసెంబ్లీలో ఈ వర్గాల సమస్యలను ప్రస్తావిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా వారికి అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తోందని పేర్కొన్నారు. 'తల్లికి వందనం' వంటి ప్రతిష్ఠాత్మక పథకాల ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని ఉమా అన్నారు.మున్సిపల్ కార్మికులు నగర పరిశుభ్రతకు వెన్నెముకలని పేర్కొన్న ఎమ్మెల్యే, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు.అనంతరం నూతనంగా ఎన్నికైన యూనివర్సల్ మున్సిపల్ వర్కర్స్ ఒ ఎంప్లాయిస్ యూనియన్ నగర శాఖ, వెహికల్ డిపో కమిటీ సభ్యులను ఉమా అభినందించి, కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమం కోసం యూనియన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టియన్ టియుసి నాయకులు, మున్సిపల్ కార్మిక సంఘ ప్రతినిధులు, యూనియన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు సేవలందించే కార్యక్రమాలు అభినందనీయం.



**విజయవాడ, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మండల టిడిపి యువ నాయకులు. ట్రస్ట్ చైర్మన్ బొమ్మిన కోటేశ్వరరావు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా, దోమల నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్, దోమల నివారణ స్ప్రే మిషన్ల ప్రారంభోత్సవ కార్యక్రమం మైలవరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ముఖ్య అతిథిగా పాల్గొని వాహనాలు, స్ప్రే మిషన్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య చర్యలు అత్యంత కీలకమని అన్నారు. గ్రామాల ప్రజలకు అవసరమైన సేవలను అందించేందుకు సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో దోమల వ్యాప్తి కారణంగా వచ్చే వ్యాధులను నివారించేందుకు ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించడం అవసరమని తెలిపారు.బొమ్మిన నారాయణ చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వాములుగా నిలవడం సంతోషకరమని అన్నారు.ప్రజల ఆరోగ్య భద్రత, పరిశుభ్రతకు సంబంధించిన కార్యక్రమాలకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బొమ్మిన కోటేశ్వరరావు, నియోజకవర్గం క్లస్టర్ ఇంచార్జ్ ముప్పిడి నాగేశ్వర్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు జనాలపాటి వేణుగోపాల్ రెడ్డి. రాయుడు వెంకటేశ్వరరావు, ఉయ్యూరు సుబ్బారెడ్డి , కుప్పిరెడ్డి అశోక్ రెడ్డిస్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి కార్యకర్తలు, సామాజిక సేవకులు జీవి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## టిడిపి నేత శ్రీనివాస్ రెడ్డి నీ కలిసిన బల్లాపల్లవి



**అనంతపురం 24 జర్నలిస్ట్ ఫైల్:** అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పార్టీ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి ని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి నేత రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి కి బొకే అందించి శాలువాతో సత్కరించారు.

## రామయపాలెంలో ఘనంగా "కంబాల పట్టు చీర కానుక -- వనితల వేడుక"



**కాకినాడ జిల్లా,జగ్గంపేట, జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** జగ్గంపేట నియోజకవర్గంలోని రామయపాలెం గ్రామంలో "కంబాల పట్టు చీర కానుక -- వనితల వేడుక" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. గ్రామం చివరి నుంచి మహిళలు పూలతో ఘన స్వాగతం పలికి ఆయనకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు చేపడుతున్న సేవా కార్యక్రమాలను మహిళలు ప్రశంసించారు.అనంతరం మాట్లాడిన కంబాల శ్రీనివాసరావు యువత రామసేన, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థల్లో చేరి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హిందుత్వ పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలని సూచించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితోనే తాను సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో హిందూ దేవాలయం ఉండేలా కృషి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. దేవాలయాలు సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం కీలకమని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీలో చేరే ఆలోచన ఉన్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రామసేన నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేద విద్యార్థిని ఉన్నత విద్యకు అండగా ఎమ్మెల్యే బొండా ఉమా 4 ద్వారా 25 వేల ఆర్థిక సహాయం



విజయవాడ, **జూలై 24 జర్నలిస్ట్ ఫైల్:** 27వ డివిజన్ భావాజీపేట కు చెందిన టంకాల మోహనప్రియ డిగ్రీ విద్యను పూర్తి చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన ల్యాప్టాప్ కొనుగోలు కోసంౖ4 కార్యక్రమం ద్వారా సహాయం చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ను కోరారు.విద్యార్థిని అభ్యర్థనను వెంటనే పరిశీలించిన ఎమ్మెల్యే ఆమె విద్యాభ్యాసానికి 25,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు, తనకు అవసరమైన ల్యాప్టాప్ కొనుగోలు చేసి ఉన్నత విద్యను విజయవంతంగా కొనసాగించాలని సూచిస్తూ ఆమెకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పేదరికం ఏ విద్యార్థి భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టినౖ4 కార్యక్రమం ఎంతోమంది నిరుపేద కుటుంబాలకు ఆశాకిరణంగా నిలుస్తోంది" ఉమా అన్నారు.సెంట్రల్ లోౖ4 కార్యక్రమం ద్వారా అనేక మంది విద్యార్థులకు, నిరుపేద కుటుంబాలకు సహాయం అందిస్తున్నామని, తమ కుమారులు బొండా సిద్ధార్థ, బొండా రవితేజ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఫీజులు, విద్యా సామగ్రి, నిత్యావసర వస్తువులు అందిస్తూ వారి చదువుకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.విద్యే భవిష్యత్తుకు బలమైన పునాది అని, చదవాలనే తపన ఉన్న ప్రతి విద్యార్థికి తమ వంతు సహాయం అందిస్తూనే ఉంటామని ఉమా పేర్కొన్నారు. పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## ధర్పల్లి. ఇందల్వాయి మండలాల్లో హోరెత్తిన నిరసనలు.. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసిన బీజేపీ శ్రేణులు




**నిజామాబాద్ రూరల్.(జర్నలిస్ట్‌ఫైల్):** : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా ధర్పల్లి.ఇందల్వాయి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఖండిస్తూ, రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మరియు రాహుల్ గాంధీ నిరంతరం దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపించారు.రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమం ఇందల్వాయి లో మండల బీజేపీ అధ్యక్షుడు జిల్లెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది ధర్పల్లి మండలం లో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు దాసు,ఆధ్వర్యంలో జరిగింది పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఘన నివాళి



**ఖమ్మం,(జర్నలిస్ట్‌ఫైల్):** జూలై 23న స్వాతంత్ర్య సమరయోధులు చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో ఘనంగా నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ "దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు తమ ప్రాణాలను అర్పించారు. చంద్రశేఖర్ ఆజాద్ ధైర్యసాహసాలు, బాలగంగాధర్ తిలక్ దేశభక్తి భావాలు ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం. విద్యార్థులు వారి ఆదర్శాలను జీవితంలో ఆచరిస్తూ క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలి" అని అన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ పి. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ "స్వేచ్ఛను సాధించడానికి మహనీయులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువరాదు. వారి జీవిత చరిత్రలను చదివి, వారు చూపిన మార్గంలో నడవడం ద్వారా విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి. దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి" అని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా, సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మ దహనం



**షాబాద్,(జర్నలిస్ట్‌ఫైల్):** నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూడుపల్లి పెంటారెడ్డి డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను అణచివేసే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనేతల అరెస్టులను,విద్యార్థులపై లాఠీ చార్జ్ ని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలో షాద్నగర్ – కంది జాతీయ రహదారిపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను పార్టీ నాయకుల తో కలిసి దహనం చేశారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే విధంగా జరిగిన నీట్ పేపర్ లీక్ ఘటన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం అమానుషమని మండిపడ్డారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరిపించి, ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు ఆదేశించిన అధికారులపై చర్యలు తీసుకోవాలనీ, రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే తొలగించాలన్నారు.అలాగే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పారదర్శకమైన పరీక్షా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంతో పాటు విద్యార్థుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూరు మల్లేష్, తమ్మలి రవీందర్, వెంకట్ రెడ్డి, గడ్డం చంద్రయ్య మరియు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న గట్టుఇప్పలపల్లి చిన్ననాటి స్నేహితులు



**తలకొండపల్లి, (జర్నలిస్ట్‌ఫైల్):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామంలో ఇటీవల చనిపోయిన శంకర్ కుటుంబన్ని గ్రామానికి చెందిన 2006-2007 బ్యాచ్ పదో తరగతి పాత విద్యార్థి శంకర్ అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అతని చిన్ననాటి స్నేహితులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు.గురువారం శంకర్ నివాసానికి చేరుకున్న పదో తరగతి మిత్రులు.. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.అనంతరం తమ స్నేహితుడి జ్ఞాపకార్థం,మానవత్వంతో కూడిన ఉదారతను చాటుకున్నారు.కుటుంబానికి తక్షణ సహాయంగా ₹47,000 నగదుతో పాటు 50 కేజీల బియ్యాన్ని అందజేసి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో బొల్లి రమేష్, అమర్ సింగ్,విజేందర్, కిరణ్, కొమ్ము రమేష్, శివ శంకర్, నూనె రాఘవేందర్ తదితర స్నేహితులు పాల్గొని, శంకర్ కుటుంబానికి ఎల్లప్పుడూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకుని కాలువ తవ్వకం.. ప్రమాదంలో తారు రోడ్డు!




**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, (జర్నలిస్ట్‌ఫైల్):** ధర్పల్లి మండలం రామడుగు నుండి కేశరాం వెళ్లే ఆర్ అండ్ బి (R&B) రోడ్డును ఆనుకుని కాలువ తవ్వడం జరిగిందని, దీనివల్ల రోడ్డు కోతకు గురై ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు అతి సమీపంలో నీటి కాలువ తీయడం వల్ల రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.ఈ ప్రమాదకర పరిస్థితిని గుర్తించిన స్థానిక రెండు గ్రామాల సర్పంచ్ లు, వి డీ సి సభ్యులు ,మరియు రైతులు అక్కడ పరిశీలన చేసి ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద వాహనాలు వెళితే రోడ్డు ఒక్కసారిగా కుంగిపోయే అవకాశం ఉన్నందున, సంబంధిత ఆర్ అండ్ బి (R&B) అధికారులు తక్షణమే స్పందించి తగిన రక్షణ గోడ లేదా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి పెద్ద ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు.

## సెయింట్ జోసెఫ్ హై స్కూల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు



**ఖమ్మం,(జర్నలిస్ట్‌ఫైల్):** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు, ఆదేశానుసారం యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హారిక ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్, శ్రీనివాస నగర్లో బాలికల కోసం హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్ పివి) వ్యాక్సిన్పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ హెచ్‌పీవీ వైరస్ కారణంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) వచ్చే ప్రమాదం ఉందని, దీనిని నివారించడంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. 14 సంవత్సరాలు నిండిన వయస్సు గల బాలికలకు సరైన సమయంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడే అవకాశాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు.తల్లిదండ్రులు తమ కుమార్తెల ఆరోగ్య రక్షణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై పూర్తి అవగాహన కలిగి, వైద్యుల సూచనల మేరకు వ్యాక్సినేషన్ చేయించాలని కోరారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం కూడా ఎంతో అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో కె.వి. రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, ఆరోగ్య కార్యకర్త శైలజ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, బాలికలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## టిబి పై అవగాహన అవసరం






**ఖమ్మం,(జర్నలిస్ట్‌ఫైల్):** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యం లో గురువారం టిబి అలెర్ట్ ఇండియా డిస్ట్రిక్ట్ టిబి ఛాంపియన్స్ ట్రైనింగ్ జిల్లా క్షయ నివారణ కార్యాలయం సహకారంతో నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా డాక్టర్ నివేదితా టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ సమాజం లోని టిబి ఛాంపియన్స్ యొక్క బాధ్యతలను తెలియజేశారు. ముఖ్యంగా 0-14 సంవత్సరాల లోపు పిల్లల్లో పెరుగుతున్నటువంటి టిబి కేసులు పై శ్రద్ధ వహించాల్సిన బాధ్యతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో టిబి అలెర్ట్ ఇండియా సిబ్బంది వెంకట్ (డిపిఎం), ప్రభాకర్, గంటయ్య, శివకుమారి, క్షయ నివారణ సిబ్బంది ఇందిరా,ఉపేందర్, హిమామ్, రాజ్యలక్ష్మి , ఇందిరా, సురేష్ పాల్గొన్నారు.

## చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు తక్షణమే అమలు చేయాలి : ప్రగతిశీల మహిళా సంఘం డిమాండ్



**నిజామాబాద్ రూరల్ సిరికొండ (జర్నలిస్ట్‌ఫైల్):** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం (POW) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సుభద్ర డిమాండ్ చేశారు. సిరికొండ మండలం తాళ్ల రామడుగు గ్రామం లో నిర్వహించిన POW జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మహిళా సాధికారత కేవలం మాటలకే పరిమితం కాకుండా, రాజకీయాల్లో మరియు చట్టసభల్లో మహిళలకు సరైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు.అలాగే, ఇటీవల నీట్ అంశంపై ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జీని POW తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని కోరారు.ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు పలువురు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రెవెన్యూ సేవల్లో జాప్యం సహించం



- నిర్దేశిత గడువులోగా ప్రజా సేవలు పూర్తి చేయాలి: జీఎంసీ కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, జాప్యం లేదా నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ హెచ్చరించారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో నీటి వినియోగ ఛార్జీల వసూళ్లు ఆశించిన స్థాయిలో లేవని పేర్కొన్నారు. ప్రతి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని బకాయిలను పూర్తిస్థాయిలో వసూలు చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నగరపాలక సంస్థకు చెందిన దుకాణాల అద్దె బకాయిలను వంద శాతం వసూలు చేయాలని, లీజు గడువు ముగిసిన దుకాణాలకు ఎలాంటి జాప్యం లేకుండా వేలం నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు.

రెవెన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. మ్యుటేషన్, కొత్త పన్ను నమోదు (న్యూ ట్యాక్స్), ఖాళీ స్థల పన్ను (వీఎల్‌టీ) తదితర సేవా దరఖాస్తులను కూడా ఆలస్యం చేయకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సేవా దరఖాస్తులను సరైన కారణం లేకుండా తిరస్కరిస్తే సంబంధిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

సమావేశంలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, సి.హెచ్. శ్రీనివాస్, జి. సాంబశివరావు, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

# దోమల నివారణతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యం



**తెనాలి (జర్నలిస్ట్‌ఫైల్) :** దోమల నివారణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను అరికట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని మారీస్‌పేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ దార రమేష్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా చంద్రబాబు నాయుడు కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మలేరియా శాఖ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. దోమలు పెరిగే నీటి నిల్వలను గుర్తించి తొలగించడంతో పాటు ప్రజలకు ఫ్రైడే డ్రై డే ప్రాముఖ్యత, డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. యూఎల్‌బీ ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ప్రతి ఏడాది జూలై నెలను డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలుగా నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు.వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, నీటి పాత్రలకు మూతలు వేయడం, దోమల ఉత్పత్తికి అవకాశం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు సూచించారు. సాయంత్రం వేళల్లో తలుపులు, కిటికీలు మూసివేయడం, పూర్తి వస్త్రధారణ, దోమతెరలు, దోమల నివారణ పరికరాలు వినియోగించడం ద్వారా దోమకాట్ల నుంచి రక్షణ పొందవచ్చని వివరించారు. అనంతరం మలేరియా శాఖ, మారీస్‌పేట ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, డెంగ్యూ వ్యతిరేక ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించగా మలేరియా సూపర్వైజర్ బండారు నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఐటి కంపెనీలకు అద్దెకు, లీజుకు ఇవ్వడానికి ఆసక్తి ఉంటే... నమోదు చేసుకోవాలి

**గుంటూరు (జర్నలిస్ట్‌ఫైల్) :** గుంటూరు జిల్లాను ఐటి హబ్ గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కమర్షియల్ భవనాలు, కార్యాలయ స్థలాలు, భూములు ఉన్న యజమానులు https:/itinfra.ap.gov.in వెబ్ సైట్ లో ఉచితంగా పేర్లను నమోదు చేసుకోవచ్చున్నారు. ఆస్తులను విక్రయించేందుకు, అద్దెకు, లీజుకు ఇవ్వడానికి ఆసక్తి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# "తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే పిల్లల భవిష్యత్తు బంగారుమయం"

- మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0లో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- లీప్ యాప్‌ను ప్రతి తల్లిదండ్రి వినియోగించాలి.. పిల్లల చదువును దగ్గరుండి పర్యవేక్షించాలి
- 580 పైగా మార్కులు సాధించిన 50 మంది, క్రీడలు-ఎన్‌సీసీ-కళల్లో ప్రతిభ కనబరిచిన 25 మందితో కలిపి మొత్తం 75 మందికి విహారయాత్ర ప్రకటించిన ఎమ్మెల్యే



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్ ఎస్‌కేబీపీఎం హైస్కూల్ (ఎన్‌జీఓస్ కాలనీ 7వ లైన్)లో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ 4.0 కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌పాస్ట్ నిర్వహించి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే, పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి ఢిల్లీ విజ్ఞాన విహారయాత్రకు వెళ్లిన విద్యార్థుల ఫోటోను ప్రధానోపాధ్యాయురాలికి అందజేశారు.

లిసభలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...లి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం అనే మూడు స్తంభాల సమన్వయమే విజయానికి మూలమని, పిల్లల విద్య పై తల్లిదండ్రుల ఆలోచనా విధానం వారి జీవితాన్ని మార్చగలదని తెలిపారు. తల్లిదండ్రుల సంకల్పమే పిల్లల భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీసుకొచ్చిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్, రాజూత్రా యాప్, విద్యా సంస్కరణలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల బాధ్యత, ఇంట్లో తల్లిదండ్రుల బాధ్యత సమన్వయంగా ఉంటేనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి తల్లిదండ్రి తమ ఫోన్‌లో లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పిల్లల హాజరు, హోంవర్క్, చదువు పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.

పేదరికం విజయానికి అడ్డంకి కాదని చెబుతూ టీ స్టాల్‌లో పనిచేసి కేవలం రోజుకు రెండు గంటల కృషితో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి ట్రిపుల్ ఐటీలో చేరిన తన స్నేహితుడి జీవిత గాథను వివరించారు. సంకల్పం, క్రమశిక్షణ, కృషి ఉంటే అసాధ్యం ఏదీ లేదని విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు.

విద్యార్థులు కేవలం మార్కులకే పరిమితం కాకుండా క్రీడలు, ఎన్‌సీసీ, కళలు తదితర రంగాల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. ఈ ఏడాది 580 పైగా మార్కులు సాధించిన 50 మంది విద్యార్థులతో పాటు, క్రీడలు, ఎన్‌సీసీ, ఆర్ట్స్‌లో ప్రతిభ కనబరిచిన మరో 25 మంది విద్యార్థులను కలిపి మొత్తం 75 మందిని విహారయాత్రకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే ప్రకటించగా విద్యార్థులు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

అలాగే తల్లిదండ్రులు పిల్లలను స్మార్ట్‌ఫోన్లకు, సోషల్ మీడియాకు, సైబర్ నేరాలకు దూరంగా ఉంచి ప్రతిరోజూ కనీసం అరగంట సమయం కేటాయించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లల్లా తీర్చిదిద్దుతున్నారని కొనియాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు--ఉపాధ్యాయులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

లిఅనంతరం మీడియాతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...లి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0 విద్యా రంగంలో ఒక చారిత్రాత్మక సంస్కరణ అని అన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగంలో 30 రోజుల, 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలతో పాటు, యూనిఫాంలు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం, రాజూత్రా యాప్ వంటి పథకాల ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారని చెప్పారు.

అలాగే ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూల్ అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని స్వాగతిస్తూ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో శారదానికేతన్ పాఠశాలను రాజూత్రా మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని, ఇప్పటికే ఆ దిశగా చర్యలు ప్రారంభమవుతున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్, డివిజన్ అధ్యక్షులు అప్పారావు యాదవ్, మామిడి రామారావు మరియు ఎన్డీయే కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యా శ్రామికుడు లోకేష్

- తల్లికి వందనంపై ప్రతి ఇంటా సంతోషం
- పీటీఎంతో తల్లిదండ్రుల్లో ఉత్సాహం
- బిడ్డల భవిష్యత్తుకు భరోసా
- తల్లికి వందనం, పీటీఎం విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- కూటమి నాయకులతో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్‌ఫైల్) :** నూతన విద్యా విధానంతో దేశంలోనే విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక ఘనత సాధించారని, ఆయన విద్యా శ్రామికుడని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కూటమి నేతలతో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో తల్లికి వందనం నిధులు జమవ్వడంతో బ్యాంకుల వద్ద కోలాహలంగా ఉందని తెలిపారు. ఎవరైనా అర్హులు తల్లికి వందనం నిధులు జమ కాకపోతే వారికి కూటమి నేతలు సహకారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ తల్లికి వందనం నిధులు జమయ్యాయని అన్నారు. ఇంట్లో ఎంత మంది చదువుతుంటే అందరికీ తల్లికి వందనం అమలు చేశామని, క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఎక్కడ పాఠశాలల్లోకి వెళ్లినా తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తును బంగారుమయం చేస్తున్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ కు అభినందనలు తెలుపుతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే కాకుండా విద్యా వ్యవస్థలో సమగ్రతను తీసుకొచ్చేందుకు ప్రత్యేక ప్రణాళికల ద్వారా పని చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా సృజనాత్మకతతో చదివించేలా ప్రయత్నిస్తున్నారన్నారు. పీటీఎం కార్యక్రమాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించేలా కూటమి నాయకులు ప్రోత్సహించాలని సూచించారు.

# పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- గ్రీవెన్స్ డేలో వినతుల స్వీకరణ



**గుంటూరు, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, సేవా సంబంధిత సమస్యలను సత్వరంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి బదిలీలు, పదోన్నతులు, సెలవులు, వైద్య అవసరాలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.

సిబ్బంది సమర్పించిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ, నిబంధనలకు అనుగుణంగా వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, వారి సమస్యలు సకాలంలో పరిష్కారమైతే విధి నిర్వహణలో మరింత సామర్థ్యం, అంకితభావం పెరుగుతాయని పేర్కొన్నారు. బదిలీలు, ఇతర పరిపాలనా నిర్ణయాలు ఖాళీలు, అవసరాలు, శాఖ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు.

పోలీస్ సిబ్బంది ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించిన ఎస్పీ, సిబ్బంది సంక్షేమమే ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలకు పునాది అని అన్నారు. విధి నిర్వహణలో ప్రతి పోలీస్ సిబ్బంది క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత పాటిస్తూ ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం, భద్రతాభావం మరింత పెంపొందేలా సేవలందించాలని పిలుపునిచ్చారు.

పోలీస్ శాఖ ఒక కుటుంబమని, పరస్పర సహకారం, సమన్వయం, గౌరవంతో పనిచేసినప్పుడే సంస్థ మరింత బలోపేతం అవుతుందని వకుల్ జిందాల్ పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# మహాకవి గుర్రం జాషువా ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తి



**గుంటూరు(జర్నలిస్ట్‌ఫైల్) :** నవయుగ కవి చక్రవర్తి, కవి కోకిల, మహాకవి కీ.శే. గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా గుంటూరు నగరంపాలెంలోని స్టేట్ బ్యాంక్ ఎదుట ఉన్న గుర్రంజాషువా విగ్రహానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

లిఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ....లి సామాజిక సమానత్వం, మానవత్వం, ఆత్మగౌరవం కోసం తన కలంతో పోరాడిన మహోన్నత కవి గుర్రం జాషువా అని, కుల, మత వివక్షలకు వ్యతిరేకంగా తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచిన మహనీయుడిగా జాషువా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు.

సమాజంలోని అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప సాహితీవేత్త జాషువా అని, ఆయన రచనలు నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ) :** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ నైతిక విలువల పెంపొందింపులో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు ప్రధానోపాధ్యాయుడు ప్రతాపరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థుల విద్యా ప్రగతి మరియు హాజరు తల్లిదండ్రుల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. తల్లిదండ్రులు కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# రాజధాని ప్రాంతంలో కాపర్ కేబుల్స్ దొంగతనాల ముఠా అరెస్ట్

- నలుగురు నిందితుల అదుపులోకి.. రూ.11.91 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



**గుంటూరు, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** రాజధాని ప్రాంతంలోని తాడేపల్లి, తుళ్లూరు పరిధిలో వరుసగా జరుగుతున్న కాపర్ కేబుల్స్ దొంగతనాల కేసులను తాడేపల్లి పోలీసులు ఛేదించారు. నాలుగు మంది నిందితులను అరెస్ట్ చేసి రూ.11.91 లక్షల విలువైన కాపర్ కేబుల్స్, రెండు టీవీలు, బంగారు గొలుసు, నేరానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మరో తొమ్మిది మంది నిందితుల నుంచి రూ.6.20 లక్షల విలువైన సొత్తు రికవరీ చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ ఎస్‌డీపీవో మురళీకృష్ణ పర్యవేక్షణలో, తాడేపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి. వీరేంద్రబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ 466/2026 కేసు విచారణలో భాగంగా ఎస్ఐ ఎస్‌కే ఖజావలి సిబ్బందితో కలిసి విశ్వసనీయ సమాచారం మేరకు మంగళగిరి గండాలయ్యపేటలో నిఘా ఏర్పాటు చేసి, నలుగురు నిందితులను ఏపీ07టీఎం2658 నంబర్ బాడీ ఆటోతో అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో నిందితులు మద్యం, గుట్కా వంటి వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిర్మాణంలో ఉన్న విల్లాలు, అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, జియో టవర్ల నుంచి కాపర్ కేబుల్స్, టీవీలు, బంగారు వస్తువులు చోరీ చేసి విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఐదు కేసులు, తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఎనిమిది కేసులు, కంకిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసుతో పాటు చిలకలూరిపేట, మంగళగిరి రూరల్ ప్రాంతాల్లో నమోదైన పలు కేసుల్లోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి 74 కట్టల కాపర్ కేబుల్స్, ఎంఐ, ఎల్‌జీ కంపెనీలకు చెందిన రెండు టీవీలు, బంగారు గొలుసు, నేరానికి వినియోగించిన ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసులో మరో కొందరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. దొంగతనాలకు పాల్పడే నేరస్థులపై సస్పెక్ట్ షీట్లు తెరిచి, మళ్లీ నేరాలకు పాల్పడితే పీడీ చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్ పి. వీరేంద్రబాబు, ఎస్ఐ ఎస్‌కే ఖజావలి, ఎస్ఐ పి. ప్రదీప్‌తో పాటు పాల్గొన్న పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ప్రజలు కొత్తగా నిర్మాణంలో ఉన్న భవనాలు, గోదాములు, కరకట్ట ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్-112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. నిర్మాణంలో ఉన్న భవనాలు, దుకాణాలు, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు,

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలిచిన మంత్రి లోకేష్



- గోదావరిలో చేపల వేటకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలతో భేటీ
- బాధిత కుటుంబ సభ్యులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసిన మంత్రి లోకేష్
- అన్ని విధాల అండగా ఉంటానని భరోసా

**రంపచోడవరం (జర్నలిస్ట్ ఫైల్):** పార్టీ జెండా మోసే కార్యకర్త గురించి, కార్యకర్త కుటుంబ సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనివిధంగా మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కార్యకర్తల సంక్షేమ విభాగాన్ని ఏర్పాటుచేసి కార్యకర్తలు, వారి కుటుంబ సభ్యులు విద్య, వైద్యం, వివాహం, ఆర్థిక అవసరాలలో ఆదుకుంటూ కొండంత అండగా నిలుస్తున్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా తాను వ్యక్తిగతంగా, ప్రభుత్వపరంగా అండగా ఉంటానని మంత్రి నారా లోకేష్ మరోసారి నిరూపించారు. పోలవరం జిల్లా రంపచోడవరంలో పర్యటిస్తున్న మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఉదయం గొల్లగూడెం వద్ద గోదావరిలో చేపలవేటకు వెళ్లి ఇటీవల ప్రాణాలు కోల్పోయిన ఊకె సుశీల, తుర్రం భారతి, బాసిబోయిన బాలరాజు, ఊకె రమేష్ కుటుంబ సభ్యులను కలిశారు. బాధిత కుటుంబాలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాల యోగక్షేమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. జరిగిన ఘటన దురదృష్టకరమని.. ఏ కష్టమొచ్చినా తాను అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యకర్తలకు టీడీపీ ఇచ్చే ప్రాధాన్యతను, ఆరోగ్యవంతమైన కేడర్ లక్ష్యంగా నాయకులు, కార్యకర్తల కోసం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య పరీక్షల గురించి ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ వివరించారు. మరోవైపు బాధిత కుటుంబాలకు ఇప్పటికే టీడీపీ తరపున రూ. 5 లక్షల ఆర్థికసాయం అందించడం జరిగింది.

## వైద్యారోగ్య శాఖ ఐఏఎస్ అధికారిపై జీఏడీ వివక్ష ?




- జీఏడీ వెబ్‌సైట్‌లో ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ స్థాయి తగ్గింపుపై విమర్శలు
- అధికారుల నిర్లక్ష్యమా.. లేక ప్రోటోకాల్ ఉల్లంఘననా?

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) నిర్వహిస్తున్న అధికారిక ఈ–డైరెక్టరీ (సచివాలయ డైరెక్టరీ)లో వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఓ ఐఏఎస్ అధికారి వివరాలను పొందుపరిచిన విధానం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జీఏడీ వెబ్‌సైట్‌లోని సమాచారంలో హోదాలకు అనుగుణంగా వివరాలు నమోదు చేయకపోవడంపై సచివాలయ ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

జీఏడీ ఈ–డైరెక్టరీలో సచివాలయంలోని 40 శాఖల వివరాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 17వ స్థానంలో ఉన్న హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖను పరిశీలిస్తే మొదట శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరాలు, అనంతరం ఇటీవల ఆ శాఖ కార్యదర్శిగా నియమితులైన ఐఏఎస్ అధికారి జి. వీరపాండియన్ వివరాలు పొందుపరిచారు.

అయితే, కార్యదర్శికి ముందే వైద్య, ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా నియమితులైన మరో ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ వివరాలను కార్యదర్శి తర్వాత ప్రత్యేకంగా చూపించాల్సి ఉండగా, వాటిని "మిడ్ లెవల్ ఆఫీసర్స్" విభాగంలో అదనపు కార్యదర్శి (ఎంఎల్ఓ) ఐ. మోహన్‌రావు తర్వాత పొందుపరిచినట్లు కనిపిస్తోంది. అంతేకాకుండా గోపాలకృష్ణకు సంబంధించిన ఫొటో, పేషీ చిరునామా వంటి వివరాలు కూడా ఈ–డైరెక్టరీలో లేకపోవడం గమనార్హం.

వాస్తవానికి వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి ఛాంబర్ పక్కనే జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణకు ఛాంబర్ కేటాయించినప్పటికీ, వెబ్‌సైట్‌లో ఆయన హోదాకు తగిన ప్రాధాన్యం కల్పించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హోదాల వారీగా వివరాలు ప్రదర్శించాల్సిన చోట ప్రోటోకాల్‌కు విరుద్ధంగా నమోదు చేయడం జీఏడీ నిర్లక్ష్యానికి నిదర్శనమని సచివాలయ ఉద్యోగులు పేర్కొంటున్నారు.

ఈ అంశాన్ని వైద్య, ఆరోగ్య శాఖ పరిపాలన విభాగం (ఓపీ) అధికారులు వెంటనే జీఏడీ దృష్టికి తీసుకెళ్లి సవరణలు చేయించాల్సిన అవసరం ఉందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. జీఏడీ నిర్లక్ష్యంతో పాటు శాఖ పరిపాలన విభాగం కూడా ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది.

జీఏడీ ఈ–డైరెక్టరీలో హోదాలకు అనుగుణంగా అధికారుల వివరాలను సక్రమంగా నవీకరించి, సంబంధిత తప్పులను వెంటనే సరిదిద్దాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

## పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య పట్ల మంత్రి సత్యకుమార్ విచారం

- తండ్రికి ఫోన్ లో పరామర్శ, ఓదార్పు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ( ఎఎంసి)కి చెందిన పీజీ వైద్య విద్యార్థి కాశీలమల్ల ఠాగూర్ నాథ్(31) ఆత్మహత్య చేసుకోవడం పట్ల రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ విచారం వ్యక్తం చేశారు. విజయవాడకు చెందిన ఠాగూర్ నాథ్ ఆంధ్ర మెడికల్ కాలేజీ పీజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకోవడం పట్ల మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి తండ్రి శ్రీనివాసరావుతో ఫోన్ లో మాట్లాడి ధైర్యం చెప్పారు. మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్‌లో జరిగిన సమీక్షా సమావేశం మధ్యలో ఈ విషయం తెలిసిన వెంటనే తండ్రితో ఫోన్‌లో మాట్లాడారు. మంచి భవిష్యత్తున్న ఉన్న ఇలాంటి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడం పట్ల ఆవేదన వెలిబుచ్చారు.

# 'తల్లికి వందనం'తో ఆర్థిక ఊరట

- ప్రభుత్వ స్కూళ్లో మంచి విద్య...నాణ్యమైన భోజనం
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో ముఖాముఖీలో ఆదివాసీ మహిళలు



**రంపచోడవరం(జర్నలిస్ట్ ఫైల్):** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతిబిడ్డకు ఆర్థిక సాయం అందుతుండటంతో తమకు విద్యా ఖర్చుల భారం గణనీయంగా తగ్గిందని గిరిజన మహిళ లు అన్నారు. ఈ పథకం తమ పిల్లల చదువుకు ఎంతో అండగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్–టీచర్ మీటింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం పోలవరం జిల్లా రంపచోడవరంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రికి ఆదివాసీ మహిళలు సాంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరస్వతి దేవికి పూలమాల సమర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**'తల్లికి వందనం' లబ్ధిదారులతో ఆత్మీయ సంభాషణ :** 'తల్లికి వందనం' పథకం లబ్ధిదారులైన గిరిజన మహిళలతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు తమ పిల్లలు చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధనా ప్రమాణాలు ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు. పాఠశాలల్లో మంచి విద్యా వాతావరణం నెలకొల్పడంతో పాటు పరిశుభ్రమైన, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని వివరించారు. అదే విధంగా తమకు స్త్రీ శక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం వల్ల పట్టణాలకు వెళ్లి చిరు వ్యాపారాలు చేసుకోవడం సులభమైందని, ఈ పథకం మహిళల ఆర్థిక సాధికారతకు దోహదపడుతోందని గిరిజన మహిళలు తెలిపారు. అంగన్వాడీ సిబ్బంది విజ్ఞప్తితో వారికీ తల్లికి వందనం అమలు చేస్తున్నామని సీఎంకు మంత్రి లోకేష్ వివరించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ గిరిజన మహిళలతో కలిసి ఆత్మీయంగా సెల్ఫీ దిగారు.

# త్యాగానికి ప్రతిరూపం తల్లిదండ్రులు

- విజ్ఞానానికి వారధులు ఉపాధ్యాయులు
- ఉత్సాహానికి, ధైర్యానికి ప్రతీకలు విద్యార్థులు
- వీరందరి సమన్వయ లక్ష్యమే మెగా పి టి యం
- కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అవిరళ కృషి చేస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

శుక్రవారం మెగా పిటీఎం 4.0 నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి తో పాటు గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు నజీర్ అహ్మద్, గుంటూరు మున్సిపల్ కమీషనర్ మయూర్ అశోక్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. తొలుత కార్యక్రమ ఉద్దేశం ను కళాశాల ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి వివరించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థినులతో కేంద్ర మంత్రి ముఖాముఖి మాట్లాడి వారితో కలసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ తాను సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని ప్రస్తుత స్థితికి కారణం ఆనాడు పడిన పునాదేనని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, రాష్ట్ర బడ్జెట్లో దాదాపు 11శాతం కేవలం విద్య కోసమే కేటాయిస్తున్నారని తెలిపారు. జీవన వ్యయం పెరిగిపోయి, తల్లిదండ్రులిద్దరూ పనిచేస్తే గానీ గడవని పరిస్థితిలో, పిల్లల్ని పూర్తిగా పర్యవేక్షించలేని స్థితి లో ఇటువంటి పేరెంట్ టీచర్ సమావేశాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. విద్యార్థినీ విద్యార్థుల బలాలు, బలహీనతలు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఒక వేదిక మీద చర్చించుకుని తద్వారా వారి భావి జీవితానికి బంగారు బాటలు ఏర్పడటానికి తోడ్పడుతుందన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రభుత్వం తీసుకువచ్చిన రాజూత్రా (లీప్) యాప్ ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, ఉచిత పుస్తకాలు వంటి పథకాలు ద్వారా పేద విద్యార్థికి నాణ్యమైన విద్య ను అందించేందుకు కృషి చేస్తున్నా మన్నారు. స్కూళ్లలో హాజరు, ఫలితాలు, మౌలిక సదుపాయాలు, బోధనా నాణ్యత ఆధారంగా స్కూల్ రేటింగ్ సిస్టమ్ తీసుకొచ్చి పాఠశాలల మధ్య ఆరోగ్యకరమైన పోటీని తీసుకువచ్చామన్నారు. పరిశుభ్రత, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, బట్టీ పద్ధతికి స్వస్తి చెప్పి క్విజ్‌లు, డిబేట్లు, క్రీడలు, వృత్తి నైపుణ్యాలతో సృజనాత్మకతను పెంపొందించేందుకు నో బ్యాగ్ డే అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థి కేంద్రంగా, ఉపాధ్యాయుడు ఒక శక్తిగా, తల్లిదండ్రులు భాగస్వామ్యులుగా నాణ్యమైన విద్యను ప్రతి ఇంటి గడపకూ చేరవేయడమే ఈ ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉద్ఘాటించారు.

లిశాసన సభ్యులు నజీర్ అహ్మద్‌లి మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని గట్టిగా నమ్ముతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా ప్రమాణాలు పెంచి తద్వారా విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఒకే రోజున రాష్ట్రవ్యాప్తంగా రెండు కోట్ల మందితో ఇటువంటి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించటం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. చదువంటే కేవలం మార్కులే కాకుండా విజ్ఞానాన్ని ఆర్జించడం ముఖ్యమని భావిస్తున్న ప్రభుత్వం రాష్ట్రాన్ని నాలడ్జ్ హబ్ గా తయారు చేసి, రాష్ట్ర విద్యార్థులు ప్రపంచం తో పోటీపడే విధంగా తీర్చిదిద్దుతున్నారన్నారు.

లిగుంటూరు మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్‌లి మాట్లాడుతూ విద్యార్థి ఎదుగుదలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. ఇటువంటి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాల ద్వారా విద్యార్థి సంపూర్ణ వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడతాయన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యా శాఖ ఆర్ జె డి పద్మ, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కళ్యాణి, డి ఈ ఒ సలీం భాష, పెద్ద ఎత్తున విద్యార్థినులు, తల్లిదండ్రులు, కళాశాల అభివృద్ధి ప్రదాతలు పాల్గొన్నారు.

## చూపులేని యువతికి ఆస్తి హక్కు కల్పించాలని బీజేపీ జనతా వారధిలో విజ్ఞప్తి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జనతా వారధి కార్యక్రమంలో కృష్ణా జిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ తన కుటుంబ సమస్యను పార్టీ నాయకుల దృష్టికి తీసుకొచ్చింది. పెళ్లి వయసుకు వచ్చిన తన చూపులేని కుమార్తెకు నాయనమ్మ రాసిన ఆస్తిని కుటుంబ సభ్యులు అప్పగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తన కుమార్తెకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని శర్మ సంబంధిత సీఐతో మాట్లాడి బాధితురాలికి న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్, రాష్ట్ర బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

## నీట్ పేరుతో దేశవ్యతిరేక రాజకీయాలు తగవు



- విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు కేంద్రం కట్టుబడి ఉంది
- బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధివల్లూరు జయప్రకాశ్ నారాయణ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** నీట్ పరీక్ష అంశాన్ని అడ్డం పెట్టుకుని ఢిల్లీలో విద్యార్థుల ఉద్యమం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుపై పూర్తి బాధ్యతతో ఎన్డీఏ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, జరిగిన లోపాలను సరిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు.

నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటికే జరిగిన లోపంపై విచారం వ్యక్తం చేస్తూ, నష్టపోయిన విద్యార్థుల కోసం అవసరమైతే మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించారని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు అనేక సంస్కరణలు చేపట్టామని, భవిష్యత్తులో పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నీట్ లీకేజీ కేసులో ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని స్పష్టం చేశారని చెప్పారు. కేసు విచారణను వేగవంతం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షానికి తగినంత సమయం ఇచ్చినా, సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయ లబ్ధికే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, విదేశీ శక్తులను ప్రోత్సహించడం, పార్లమెంట్‌పై దాడులకు ప్రేరేపించడం, ప్రధాని మోదీని వ్యక్తిగతంగా దూషించడం, హిందూ సమాజంపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు.

ప్రధాని నివాసం వద్ద మెరుపు ధర్నాల పేరుతో హింసాత్మక పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించిన ఆయన, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు.

కాంగ్రెస్, ఆప్, కమ్యూనిస్టు పార్టీలు తదితర ప్రతిపక్షాలు విద్యార్థి ఉద్యమం ముసుగులో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని, ఎక్కడ ఉద్యమం జరిగినా అక్కడ శవ రాజకీయాలు చేయడం వారి అలవాటుగా మారిందని విమర్శించారు. స్వరా భాస్కర్, రాకేష్ తికాయత్, బృందా కారత్, అరుంధతి రాయ్, అఖిలేష్ యాదవ్, మనీష్ సిసోడియా తదితరులు ఉద్యమానికి సంబంధం లేని వ్యాఖ్యలతో దేశంలో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ పాలనలో అనేక పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు సమర్థవంతమైన చర్యలు తీసుకోలేదని, మోదీ ప్రభుత్వం మాత్రం జరిగిన లోపాన్ని అంగీకరించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు చేపడుతోందని వల్లూరు జయప్రకాశ్ నారాయణ స్పష్టం చేశారు. పాత్రికేయుల సమావేశంలో బిజెపి రాష్ట్ర మీడియా ఇంఛార్జి కిలారి దిలీప్ పాల్గొన్నారు.

## ఎన్‌టీఏలో భారీ ప్రక్షాళన..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వివాదంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. పరీక్షా వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచేందుకు, విద్యార్థుల్లో నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు గాను ఎన్టీఏలో సంచలన ప్రక్షాళన చేపట్టింది. ఇందులో భాగంగా 47 మంది అధికారులను విధుల్లోంచి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. వీరిలో కొందరిపై చట్టపరమైన మరియు క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ 'ఏఎన్ఐ' వార్తా సంస్థ వెల్లడించింది.

**ఔట్‌సోర్సింగ్ విధానంలో భారీ మార్పులు:** గత కొన్ని నెలలుగా నీట్ సహా పలు పోటీ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో భారీ ఆందోళనలు చేపట్టారు. ఈ నిరసనల నేపథ్యంతో పాటు భవిష్యత్తులో లీకేజీలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం అనేక కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. పరీక్షల భద్రతను పెంచేందుకు ఎన్టీఏ ఉపయోగిస్తున్న ప్రస్తుత ఔట్‌సోర్సింగ్ నమూనాను పూర్తిగా సమీక్షించి, లీకేజీలకు తావులేకుండా మార్పులు చేయనున్నారు.

# ప్రతి విద్యార్థి చదువుకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

- ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రెండో ఏడాది 'తల్లికి వందనం' అమలు
- ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు




**చుండూరు, జూలై 24 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ నిర్వహించిన మెగా పేరెంట్––టీచర్ మీటింగ్ కార్యక్రమం చుండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులతో కలిసి విద్యా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.

కార్యక్రమానికి ముందు పాఠశాల నుంచి సుమారు 500 మీటర్ల మేర అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా 'తల్లికి వందనం' పథకం, ప్రభుత్వ విద్యా సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక మౌలిక వసతులు, నాణ్యమైన విద్యపై ప్రజలకు అవగాహన కల్పించారు.

అనంతరం జరిగిన మెగా పీటీఎంలో విద్యార్థుల ప్రగతి నివేదికలను పరిశీలించిన ఎమ్మెల్యే, తల్లిదండ్రులతో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థుల హాజరు, అభ్యాస స్థాయి, పరీక్షల ఫలితాలు, విద్యా నాణ్యత, పాఠశాల అభివృద్ధిపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా 'తల్లికి వందనం' పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నా ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ. 13 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తూ కుటుంబాలపై విద్యాభారాన్ని తగ్గిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 67,47,190 మంది విద్యార్థులకు రూ. 10,120.78 కోట్లను నేరుగా తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా విద్య పట్ల ప్రభుత్వం ఉన్న నిబద్ధతను మరోసారి చాటిందన్నారు. పథకం లబ్ధిదారులతో మాట్లాడిన సందర్భంగా పలువురు మహిళలు తమ పిల్లల విద్యా ఖర్చులు గణనీయంగా తగ్గాయని, ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరిగిందని పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, డిజిటల్ బోధన, నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందుతున్నాయని తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయని మహిళలు పేర్కొన్నారని చెప్పారు.

కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులతో తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపిస్తూ, వారి చదువుపై నిరంతరం శ్రద్ధ వహిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వం సమిష్టిగా పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

అనంతరం విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించే ప్రదర్శనలను పరిశీలించి, ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467